విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 | సంచిక :95 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 25 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool






## రెండు సూసైడ్ నోట్లలో సాదిక్ పేరు

- మతం మారాలన్న ఒత్తిడితోనే ఆత్మహత్యలు!
- పది బృందాలతో గాలించి మీరట్‌లో అరెస్ట్
- కాకినాడ ఎస్పీ బిందుమాధవ్

3



## చంచల్‌గూడ జైలుకు కారుమూరి!

- ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో మాజీ మంత్రి అరెస్ట్
- సెప్టెంబర్ 7 వరకు రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు
- కారుమూరి పాత్రపై మరింత దర్యాప్తు అవసరమన్న ఈడీ
- అక్రమ రవాణా, లావాదేవీలపై ముమ్మర విచారణ

...మిగతా 3లో

## భారత్‌పై దాడులకు పాక్ కుట్రలు పన్నుతోందా?



- ఆయుధాలు సమీకరించుకుంటున్న పాకిస్థాన్!
- ఇస్లామిక్ కూటమితో బలపడే వ్యూహాలు
- టర్కీ నుంచి రహస్యంగా డ్రోన్లు, ఆయుధాల దిగుమతి
- మక్కా ఒప్పందంలోకి ఇరాన్‌కు ఆహ్వానం

బలూచిస్థాన్ తదితర ప్రాంతాల్లో అంతర్గత సమస్యలతో సతమతమవుతున్న పాకిస్థాన్.. వాటిని పక్కదారి పట్టించేందుకు భారత్‌తో యుద్ధానికి కుట్రలు పన్నుతోందా? పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలు, పాక్ వ్యవహారశైలి చూస్తుంటే రక్షణ నిపుణులకు ఇదే అనుమానం కలుగుతోంది. ఆపరేషన్ సింధూర్ తర్వాత పాకిస్థాన్ తీరు మరింత అనుమానాస్పదంగా మారింది. ఇస్లామిక్ కూటమితో బలపడేందుకు అంతర్జాతీయంగా పాక్ చేస్తున్న ప్రయత్నాలు కలకలం రేపుతున్నాయి.

4

## ఆంధ్రా పాప్‌కార్న్.. అదుర్స్!

పంటల ప్రాసెసింగ్‌తోనే అసలైన సంపద సృష్టి

- ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్త ఎదగాలి
- నదుల అనుసంధానంతో కరవుకు శాశ్వత చెక్
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఏలూరు జిల్లాలో భారీ ప్రాసెసింగ్ యూనిట్
- ప్రారంభించిన సీఎం, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

ప్రపంచ మార్కెట్లకు మన ఉత్పత్తులు

రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను ముమ్మరంగా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతాంగానికి పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా ఉత్పత్తులకు తగిన గుర్తింపు లభించి, తద్వారా రైతులకు భారీగా లాభాలు చేకూరి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన దేశీయ వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు దీటుగా ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం ఉద్ఘాటించారు. ఏలూరు జిల్లా నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద గార్నెట్ సంస్థ ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్ద 'పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌లతో కలిసి గార్నెట్ పాప్‌కార్న్ నాన్ జీఎంఓ (జన్యుమార్పిడి జరగని) హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో చంద్రబాబు

మిగతా 2 లో




## 19 ఏళ్లకే కిరీటం

'మిస్ యూనివర్స్ ఇండియా-2026'గా కాజియా లిజ్ మెజో

- 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి కేరళ యువతి ఘనత
- లా చదువుతూనే మోడలింగ్‌లో సత్తా.. కళల్లోనూ బహుముఖ ప్రజ్ఞ

వివరాలు 3లో..






## విదేశీ విత్తనాల వాడకం తగ్గాలి!

- స్వదేశీ పరిజ్ఞానంతోనే ఆహార భద్రత, స్వయం సమృద్ధి
- దిగుమతులపై ఆధారపడే స్థాయి నుంచి ఎగుమతులు చేసేలా ఎదగాలి
- ముసునూరు సభలో ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ పిలుపు
- 'నాన్-జీఎంఓ' మొక్కజొన్న వంగడం ఆవిష్కరణ

02



## పౌరులకు ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు

ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

02



## కేంద్రంపై సీజేపీ సమరశంఖం!

- సెప్టెంబర్ 5న ఇండియా గేట్ వద్ద భారీ నిరసన
- జెన్ జీని సర్కార్ మోసగించిందని తీవ్ర ఆగ్రహం
- ప్రభుత్వ బడుల దుస్థితిపై విద్యా శాఖ మంత్రికి లేఖ

4

## బీసీల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం!

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీసీ గురుకులం
- త్వరలోనే నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం
- ఆలూరు పర్యటనలో మంత్రులు సవిత, రామానాయుడు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. ఆలూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచే ఆలూరులో నూతన బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తామని ఆమె ప్రకటించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో మంత్రి

మిగతా 3 లో



## అట్టహాసంగా అమరావతి ఛాంపియన్‌షిప్

- ఘనంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవం
- రెండు లక్షల మంది క్రీడాకారుల భాగస్వామ్యం
- ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- పాల్గొన్న మంత్రులు సత్యప్రసాద్, అనిత, రాంప్రసాద్ రెడ్డి



02



# అట్టహాసంగా అమరావతి ఛాంపియన్‌షిప్

**ఘనంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవం**

**రెండు లక్షల మంది క్రీడాకారుల భాగస్వామ్యం**

**ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు**

ఎస్వీ యూనివర్సిటీ తారకరామా మైదానంలో సోమవారం అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, క్రీడల మంత్రి మండేపల్లి రాంప్రసాద్ రెడ్డిలతో కలిసి శాప్ చైర్మన్ రవి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2,07,498 మంది క్రీడాకారులు పాల్గొనడం ద్వారా ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఈ మేరకు రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు శాప్ చైర్మన్‌కు ధ్రువీకరణ పత్రాన్ని సభా వేదికపై అందజేశారు. క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్, చిన్నారుల డ్యాన్సులు ఆహుతులను విశేషంగా ఆకట్టుకోగా.. డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా క్రీడాకారుల చేత ప్రతిజ్ఞ చేయించారు. క్రీడలతో విద్య, విద్యతో ఉద్యోగం అనే నినాదంతో కూటమి ప్రభుత్వం యువతను ఎంతగానో ప్రోత్సహిస్తోందని మంత్రులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన వారికి ఏడు కోట్ల రూపాయల భారీ ప్రోత్సాహకం ఇస్తున్నట్లు మంత్రి సత్యప్రసాద్ తెలిపారు. క్రీడల పట్ల ఇప్పుడు తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు రావడం సంతోషకరమని మంత్రి అనిత హర్షం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా నియోజకవర్గ స్థాయి నుంచి ఈ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత నారా లోకేష్ ఆలోచనల మేరకు భవిష్యత్తులో తిరుపతి నగరం క్రీడలకు కేంద్ర బిందువుగా మారుతుందని శాప్ చైర్మన్ రవి నాయుడు ఆకాంక్షించారు.

**హోంమంత్రి అనితకు గాయం**

ఇదిలా ఉండగా.. ఈ వేడుకలో ఊహించని అపశ్రుతి చోటుచేసుకుంది. బ్యాటరీ ఛార్జింగ్ అయిపోవడంతో సభను చిత్రీకరిస్తున్న ఓ డ్రోన్ అకస్మాత్తుగా హోంమంత్రి వంగలపూడి అనితపై పడింది. దీంతో ఆమె కుడి చేతికి స్వల్ప గాయమైంది. వెంటనే అప్రమత్తమైన వైద్య సిబ్బంది ఆమెకు అక్కడే ప్రథమ చికిత్స అందించారు. ఈ ఘటనతో సభా ప్రాంగణంలో కాసేపు గందరగోళం నెలకొంది.

# తిరుపతిలో అధునాతన మహిళా పోలీస్ స్టేషన్!

**రూ.2.70 కోట్లతో నూతన భవన నిర్మాణం**

**ప్రారంభించిన మంత్రులు అనిత, సత్యప్రసాద్**



:మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ తిరుపతిలో సుమారు రూ.2.70 కోట్ల వ్యయంతో నిర్మించిన అధునాతన మోడల్ మహిళా పోలీస్ స్టేషన్‌ను హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ స్టేషన్‌లో బాధిత మహిళల కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రంతో పాటు వారానికి రెండు రోజుల పాటు సైకియాట్రిస్ట్ సేవలు అందించనున్నారు. ఫిర్యాదులు చేసేందుకు వచ్చే మహిళల వెంట ఉండే పిల్లల కోసం ప్రత్యేకంగా 'చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్' ఏర్పాటు చేశారు. సైబర్ నేరాలపై వేగంగా స్పందించేందుకు ఇరవై నాలుగు గంటలు పనిచేసే సైబర్ సహాయ కేంద్రాన్ని కూడా అందుబాటులోకి తెచ్చారు.

గతేడాదితో పోలిస్తే తిరుపతి జిల్లాలో మహిళలపై నేరాలు 94 నుంచి 58కి తగ్గడం గమనార్హమని హోంమంత్రి అనిత తెలిపారు. మహిళలు ఎలాంటి భయం లేకుండా పోలీసులను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని సూచించారు. పెరుగుతున్న రద్దీ, పని ఒత్తిడి దృష్ట్యా తిరుపతికి ప్రత్యేక పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేసే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఎమ్మెల్యేలు అరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ఆదిమూలం, బొజ్జల సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె

**వరుస సెలవులతో కస్టమర్లకు ఇబ్బందులే**

**న్యూఢిల్లీ,ఆగస్ట్24:** దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలంటూ బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు. ఇక సోమవారం14న వినాయక చవితి కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నడవవు. అలా నాలుగురోజుల పాటు బ్యాంక్ సేవలు అందక ప్రజలు కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. 11వ తేదీతోపాటు సెప్టెంబర్ 28 నుంచి మూడురోజుల పాటు మరోసారి సమ్మె చేస్తామని యూనియన్ హెచ్చరించింది. సెప్టెంబర్ 30తో ఆర్థిక సంవత్సరం సగం పూర్తవుతుంది. అప్పుడు అన్ని సంస్థలు తమ ఖాతా పుస్తకాలను సరిచూసుకుంటాయి. వారానికి ఐదు రోజుల డిమాండ్‌తో పాటు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం, పింఛను విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బ్యాంక్ సిబ్బంది కోరుతున్నారు.

# ఆంధ్రా పాప్‌కార్న్.. అదుర్స్!

(మొదటి పేజీ తరువాయి..)

ప్రసంగించారు. "రైతులపై ఉన్న అమితమైన ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చిన అతిథులు.. రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్కజొన్న విత్తనాలను ఆవిష్కరించారు. గార్నెట్ పాప్‌కార్న్ సంస్థ భారత నేలపైనే స్వదేశీ పరిజ్ఞానంతో నాన్ జీఎంఓ విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే ఈ పాప్‌కార్న్ మొక్కజొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకు సైతం ఎగుమతి కావడం గర్వకారణం. గార్నెట్ పాప్‌కార్న్ సంస్థ నేడు దేశంలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో నాన్ జీఎంఓ హైబ్రిడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్న సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు. దేశవ్యాప్తంగా పాప్‌కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్నెట్ సంస్థ.. ముసునూరు వద్ద ఇంతటి భారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషదాయకం. ఆధునిక యాంత్రీకరణ, నాణ్యమైన విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు లాంటివన్నీ ఇక్కడ ఎంతో వ్యవస్థీకృతంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్‌కార్న్‌కు సంబంధించిన ఆదాయం బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లిపోయేది. ఇక నుంచి ఆ సంపదంతా మన దేశంలోనే ఉండిపోతుంది" అని ముఖ్యమంత్రి వివరించారు.

**ఆంధ్రా పాప్‌కార్న్.. అరకు కాఫీ!**

ఒక్క ఆసియా ఖండానికే పరిమితం కాకుండా గ్లోబల్ మార్కెట్‌కు మన పాప్‌కార్న్ ఎగుమతి కావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. "ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీ లాంటి అద్భుతమైన ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్లుగా ఎదగాలి. వీటి విక్రయాల కోసం రైల్వే స్టేషన్లలోనూ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. కొండపల్లి కొయ్య బొమ్మలు లాంటి మన స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు సగర్వంగా వెళ్లాలి. కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని కేవలం వృత్తిగా కాకుండా ఒక బలమైన ఆర్థిక శక్తిగా చూస్తున్నాయి. రైతులను ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలన్నదే



మా సంకల్పం. పసుపు, మిరప, మొక్కజొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ఫుడ్ ప్రాసెసింగ్ చేసి, అద్భుతమైన బ్రాండ్‌తో అంతర్జాతీయ విపణిలోకి తరలిద్దాం. అప్పుడే వాటి విలువ పెరిగి రైతులకు నిజమైన ప్రయోజనం కలుగుతుంది" అని స్పష్టం చేశారు.

**ఉద్యానవనాల హబ్‌గా రాయలసీమ**

ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న పంటల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నామని ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని మరింతగా విస్తరిస్తే అధిక సంపదను ఆర్జించే అవకాశం ఉంటుందని, ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలని ఆకాంక్షించారు. మన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు విధానం కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. నూజివీడు ప్రాంతంలో ఇప్పుడు పామాయిల్, కోకో, ఆక్వా లాంటి వాణిజ్య పంటలు భారీగా పెరిగాయని, వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల్లోనూ మన రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రెండు మూడు దశాబ్దాల్లో ఎలాంటి పంటలు పండించాలి, ఆర్థిక వ్యవస్థ ఎలా ఉండాలనే దానిపై స్పష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన పంటల హబ్‌గా మార్చేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని, లక్ష కోట్ల రూపాయల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో సీమను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

**నీటి భద్రతతోనే అన్‌స్టాపబుల్ గ్రోత్!**

సాగునీటి ప్రాజెక్టుల ఆవశ్యకతను సీఎం నొక్కిచెప్పారు. "రాష్ట్రవ్యాప్తంగా 35 వేల కోట్ల రూపాయలతో 36 సాగు ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో శరవేగంగా పూర్తిచేస్తాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ.. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు సకాలంలో తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఈ ప్రాంత ముఖచిత్రమే మారిపోతుంది. అలాగే ఈ నెలాఖరులోనే వెలిగొండ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు సమృద్ధిగా సాగునీరు అందిస్తాం. ఎల్ నినో వల్ల నీటి ఎద్దడి తలెత్తే ముప్పు ఉన్నందున, పప్పు ధాన్యాల లాంటి ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేలా పటిష్ట చర్యలు చేపట్టాం. రైతులు కూడా ప్రభుత్వానికి సహకరించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం జరిగి జలవనరుల సద్వినియోగం జరగాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన ఆలోచన అని సీఎం తెలిపారు. గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరీ నదులను అనుసంధానించడం ద్వారా నాలుగు రాష్ట్రాల్లోని సాగు, తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. కష్టకాలంలో ఆయకట్టు స్థిరీకరణకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. గంగా, మహానది, గోదావరి నదులను సైతం అనుసంధానించుకుంటే వేల టీఎంసీల నీటిని సమర్థవంతంగా వినియోగించుకోగలమని ముఖ్యమంత్రి చెప్పారు. దేశానికి నీటి భద్రత కల్పిస్తే.. అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా సాగుతుందని చంద్రబాబు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ విత్తనాల వాడకం తగ్గాలి

- స్వదేశీ పరిజ్ఞానంతోనే ఆహార భద్రత, స్వయం సమృద్ధి
- దిగుమతులపై ఆధారపడే స్థాయి నుంచి ఎగుమతులు చేసేలా ఎదగాలి
- ముసునూరు సభలో ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ పిలుపు

విదేశీ హైబ్రిడ్ విత్తనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత, స్వయం సమృద్ధిని సాధించడం ప్రస్తుత తరుణంలో అత్యంత కీలకమని భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిదని ఆయన ఉద్ఘాటించారు. ఏలూరు జిల్లా ముసునూరులో 'గార్నెట్ పాప్‌కార్న్' సంస్థ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా జన్యుపరంగా మార్పు చేయని (నాన్-జీఎంఓ) సరికొత్త పాప్‌కార్న్ మొక్కజొన్న వంగడాన్ని శనివారం ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి ఉపరాష్ట్రపతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందేమాతరం, జనగణమన, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలతో సభ ఆరంభమైంది. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రసంగిస్తూ రైతాంగానికి, ప్రభుత్వాలకు పలు కీలక సూచనలు చేశారు. "దేశ జీడీపీ, స్థూల విలువ జోడింపులో వ్యవసాయ రంగం సుమారు ఐదో వంతు (1/5వ) వాటాను కలిగి ఉండటమే కాకుండా, 46.1 శాతం మందికి ఉపాధిని, 55 శాతం జనాభాకు జీవనాధారాన్ని అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. భారతదేశం భవిష్యత్తులో పాప్‌కార్న్ విత్తనాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతుండటం ప్రశంసనీయం. 8 రాష్ట్రాల్లో దాదాపు 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, ఎటువంటి అప్పుల ఊబిలో పడకుండా మంచి లాభాలు ఆర్జిస్తుండటం ఎంతో సంతోషకరం" అని ఆయన పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్, పీఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మహిళా



సంఘాలకు ఆధునిక సాంకేతికతను జోడించే 'నమో డ్రోన్ దీదీ' వంటి పథకాలు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని ఉపరాష్ట్రపతి కొనియాడారు. ఇదే సమయంలో ఏపీలో సీఎం చంద్రబాబు రైతు బజార్లు, సహజ వ్యవసాయం వంటి విధానాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. భవిష్యత్ వ్యవసాయ సమృద్ధి కోసం దక్షిణ భారత నదుల అనుసంధానం, అన్ని జిల్లాలకు సమగ్ర సాగునీటి సౌకర్యాల కల్పన అత్యంత ఆవశ్యకమని ఆయన స్పష్టం చేశారు.

**గార్నెట్ పరిశోధనాశాల పరిశీలన..**

అంతకుముందు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ముసునూరులోని గార్నెట్ పాప్‌కార్న్ సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థలో చేపడుతున్న నాన్-జీఎంఓ మొక్కజొన్న వంగడాల అభివృద్ధి, విత్తనాల ఉత్పత్తి, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. మొక్కజొన్న విత్తనాల విభాగంతో పాటు విత్తన పరిశోధనాశాలను (ఆర్ అండ్ డీ) సందర్శించి, అక్కడ జరుగుతున్న పరిశోధనా కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. విత్తనాల ప్రత్యేకతలు, రైతులకు కలిగే ప్రయోజనాలపై సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.పి.పి.పట్టాభిరామారావు తదితరులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపరాష్ట్రపతి బ్యాటరీ కారులో ప్రధాన సభా వేదిక వద్దకు చేరుకున్నారు.

**100 మిలియన్ డాలర్ల ఆదా: గవర్నర్ నజీర్**

దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు రైతాంగమే వెన్నెముక అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వరి, గోధుమల తర్వాత దేశంలో మొక్కజొన్న మూడో అతిపెద్ద పంట అని గుర్తుచేశారు. గార్నెట్ సంస్థ వల్ల గతంలో అర్జెంటీనా, బ్రెజిల్‌లకు వెళ్లే ఆదాయంలో 70 శాతం నేరుగా మన భారతీయ రైతులకు దక్కుతోందని, తద్వారా 100 మిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతోందని గవర్నర్ కొనియాడారు. అరకు కాఫీ లాగే ఈ పాప్‌కార్న్ కూడా ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాప్‌కార్న్ ఉత్పత్తిలో విశేష రాబడి సాధించిన ఉత్తమ రైతులను ఉపరాష్ట్రపతి ఘనంగా సత్కరించారు. గార్నెట్ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర బాబు, మహీధర్ రెడ్డి, యుగంధర్, ప్రిఫర్డ్ పాప్‌కార్న్ సీఈవో నార్మ్ క్రుగ్ తదితరులు అతిథులను దుస్సాలువా, కొండపల్లి బొమ్మలతో ఘనంగా సత్కరించారు.

అంతకుముందు గార్నెట్ ప్రాంగణానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, కొలుసు పార్థసారథి, కింజరాపు అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఐజీ జీవీజీ అశోక్ కుమార్, కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిశోర్, గార్నెట్ సంస్థ ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.

**మన డబ్బు మన దేశంలోనే: సీఎం చంద్రబాబు**

ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు విలువ జోడించి అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్‌కార్న్‌కు సంబంధించిన ఆదాయం బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లిపోయేదని, గార్నెట్ సంస్థ కృషితో ఇక నుంచి ఆ సంపదంతా మన దేశంలోనే ఉండిపోతుందని హర్షం వ్యక్తం చేశారు. నదుల అనుసంధానంతో నాలుగు రాష్ట్రాల్లో నీటి సమస్య పరిష్కారమవుతుందని సీఎం పునరుద్ఘాటించారు.

# పౌరులకు ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు


**సర్టిఫికెట్ల అప్‌లోడ్ లేకుండా డేటా ఇంటిగ్రేషన్**

**ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు**

అమరావతి (సమయం న్యూస్): ఏఐ, బ్లాక్‌చైన్ వంటి అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ సేవలను సులభతరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటి నుంచే సేవలు పొందేలా చూడాలన్నారు. సోమవారం సచివాలయంలో ఆర్టీజీఎస్ సమీక్ష నిర్వహించిన ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పదే పదే సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసే శ్రమ లేకుండా డేటా ఇంటిగ్రేషన్ ప్రక్రియ జరగాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి 20 శాతం మేర వ్యవసాయ దిగుబడులు తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. దీనిపై స్పందించిన సీఎం.. సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు అందించాలని ఆదేశించారు. ఇంకా సాగు మొదలుపెట్టని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడంతో పాటు రైతులకు ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు.

**సోలార్‌పై ఫోకస్..**

ఆరోగ్య శాఖపై సమీక్షిస్తూ.. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే హాట్‌స్పాట్‌లను గుర్తించి ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. అటు రాష్ట్రం 'కార్బన్ న్యూట్రల్' లక్ష్యాన్ని చేరుకోవడానికి పునరుత్పాదక ఇంధన వనరులపై దృష్టి సారించాలన్నారు. ఇందులో భాగంగా ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు తక్షణమే కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.



# బీసీల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం!

(మొదటి పేజీ తరువాయి..)

సవిత సోమవారం విస్తృతంగా పర్యటించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శ్రేణుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో సింహభాగం లబ్ధి పొందుతున్నది బీసీలేనని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీసీ జనాభా అధికంగా ఉన్నందున వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు టీడీపీ ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి కోరారని, ఆమె విజ్ఞప్తి మేరకు గురుకుల పాఠశాల మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా ఆలూరులో ప్రత్యేక టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు గట్టిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల కల్పనను పరుగులు పెట్టిస్తున్నామని వివరించారు.



### అక్రమాలు లేకున్నా బురదజల్లుతున్నారు..

గత ప్రభుత్వంలో పనిచేసిన నీటిపారుదల శాఖ మంత్రులకు పోలవరం సహా సాగునీటి ప్రాజెక్టులపై కనీస అవగాహన కూడా లేదని మంత్రి సవిత విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల మెప్పు పొందేలా పాలిస్తుంటే.. ఓర్వలేక జగన్, ఆయన బృందం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మెగా డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరగకపోయినా పనిగట్టుకుని బురదజల్లుతున్నారని ధ్వజమెత్తారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలూరులో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు సమన్వయంతో ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం: రామానాయుడు

మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు ఆలూరు చేరుకున్న మంత్రులకు పార్టీ శ్రేణులు గజమాలలతో ఘనస్వాగతం పలికాయి. వర్షంలోనూ భారీ ర్యాలీ నిర్వహించి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శంకులమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు బొజ్జమ్మ సావిత్రి, పార్వతమ్మ, దేవేంద్రప్ప, జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, పరిశీలకులు ఆదినారాయణ, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# 19 ఏళ్లకే అందాల కిరీటం

**'మిస్ యూనివర్స్ ఇండియా-2026'గా కాజియా లిజ్ మెజో**

**52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి కేరళ యువతి ఘనత**

**లా చదువుతూనే మోడలింగ్‌లో సత్తా.. కళల్లోనూ బహుముఖ ప్రజ్ఞ**

**నవంబర్‌లో ప్రపంచ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం**

**జైపూర్, ఆగస్టు 24:** కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో అందాల ప్రపంచంలో మరో అరుదైన ఘనత సాధించారు. జైపూర్‌లో అట్టహాసంగా జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా–2026' గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి విజేతగా నిలిచారు. ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని సొంతం చేసుకున్న కాజియా.. నవంబర్‌లో పోర్టోరికో వేదికగా జరగనున్న 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. కేరళకు చెందిన కాజియా బాల్యం ఎక్కువగా యూఏఈలోని అబుదాబిలో గడిచింది. అక్కడి ఎమిరేట్స్ నేషనల్ స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్, అబుదాబి ఇండియన్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. ప్రస్తుతం న్యాయ విద్య అభ్యసిస్తూనే మోడలింగ్‌లో రాణిస్తున్నారు. అందాల పోటీలకే పరిమితం కాకుండా కళారంగంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

### నాట్యం నుంచి నటన వరకు..

కాజియా 12 ఏళ్ల పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందారు. గానం, సంగీతంపైనా ఆమెకు మంచి పట్టు ఉంది. డ్రమ్స్, వయోలిన్ వాయించగలరు. బహిరంగ ప్రసంగాలు, నటనలోనూ అనుభవం సంపాదించారు. మలయాళ చిత్రం 'షైలాక్' ద్వారా నటిగా వెండితెరకు పరిచయమయ్యారు. చిన్న వయసులోనే అందాల పోటీల్లో విజయాల పరంపర మొదలుపెట్టారు. 17 ఏళ్ల వయసులో 'మిస్ టీన్ దివా–2024' కిరీటాన్ని గెలుచుకున్నారు. 2025 మిస్ టీన్ ఇంటర్నేషనల్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి తొలి రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది 'మిస్ యూనివర్స్ కేరళ--2026' విజేతగా నిలవడంతో పాటు ఆ కిరీటాన్ని గెలుచుకున్న అత్యంత పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందారు. తాజాగా జాతీయ కిరీటాన్ని కూడా తన ఖాతాలో వేసుకున్నారు.

### 52 మందిలో మేటిగా..

జైపూర్‌లో జరిగిన తుది పోరులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 52 మంది ఫైనలిస్టులు పోటీపడ్డారు. చివరకు కాజియా లిజ్ మెజో విజేతగా నిలవగా, తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ తొలి రన్నరప్‌గా, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవ్లేకర్ రెండో రన్నరప్‌గా నిలిచారు. అనుశ్రీ 'మిస్ ఇంటర్నేషనల్ ఇండియా––2026' టైటిల్‌ను కూడా దక్కించుకున్నారు. ఈ గ్రాండ్ ఫినాలేలో మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్‌తో పాటు ఊర్వశి రౌతేలా, సెలీనా జైట్లీ తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఇప్పుడు కాజియా లక్ష్యం ప్రపంచ కిరీటం. నవంబర్‌లో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున ఆమె ప్రదర్శనపై అందరి దృష్టి నిలవనుంది.

# విశ్వవ్యాప్తంగా శ్రీవారి వైభవం!

**సరికొత్త కార్యక్రమాలతో ఎస్వీబీసీ.. ఆధునిక సాంకేతికతతో భక్తులకు చేరువ**

**ఉద్యోగులతో ఛైర్మన్ శ్రీధర్ వర్మ ముఖాముఖి**



**తిరుపతి:** శ్రీవారి వైభవాన్ని, సనాతన ధర్మాన్ని సరికొత్త కార్యక్రమాలతో విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎస్వీబీసీ నూతన ఛైర్మన్ బి.శ్రీధర్ వర్మ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం తిరుపతిలోని కార్యాలయంలో ఆయన ఉద్యోగులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సిబ్బంది విధులు, శాఖల పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఛానల్ ప్రసారాలపై అధికారులతో శ్రీధర్ వర్మ సమీక్షించారు. ఆధునిక సాంకేతికతను జోడించి దేశ, విదేశాల్లోని భక్తులకు స్వామివారి మహిమను మరింతగా చేరువ చేయాలని సూచించారు. ఎస్వీబీసీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత స్థానానికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# వైభవంగా శ్రీవారి పవిత్ర సమర్పణ!

**పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శాస్త్రోక్తంగా పూజలు**

**స్వామివారు, పరివార దేవతలకు పవిత్ర మాలల అలంకరణ**

**మాడ వీధుల్లో విహరించిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి**



**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ముందుగా ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టి, సంపంగి ప్రాకారంలో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో ఉత్సవమూర్తులకు విశేషంగా స్నపన తిరుమంజనం జరిపించారు. అనంతరం వేదఘోష నడుమ శ్రీవారి మూలవిరాట్టుతో పాటు ఉత్సవ మూర్తులకు, ఇతర పరివార దేవతలకు, ఆనంద నిలయం, ధ్వజస్తంభం, బలిపీఠాలకు పవిత్ర మాలలను సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు కనువిందు చేశారు. తులసి పెంచే పవిత్రమైన మట్టిలో పండించిన పత్తి, పట్టు దారాలతో ఈ పవిత్ర మాలలను ప్రత్యేకంగా తయారు చేస్తారు. 15, 16వ శతాబ్దాల్లో జరిగిన ఈ ఉత్సవాలను 1962లో టీటీడీ తిరిగి పునరుద్ధరించింది. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# గోర్మె పాప్ కార్నికా సంస్థ శాస్త్రవేత్తలకు పవన్ కల్యాణ్ అభినందనలు

**వ్యవసాయ రంగంలో ఇదో కీలక మైలురాయిగా వర్ణన**

**అమరావతి (సమయం న్యూస్):** ఏలూరు జిల్లా ముసునూరుకు చెందిన 'గోర్మె పాప్ కార్నికా' సంస్థ సరికొత్త మొక్కజొన్న వంగడాన్ని సృష్టించింది. జన్యుపరంగా ఎలాంటి మార్పులు చేయని (నాన్ జీఎంఓ) ఈ పాప్ కార్న్ వంగడాన్ని అభివృద్ధి చేసిన సంస్థ యాజమాన్యానికి, పరిశోధక బృందానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. వ్యవసాయ రంగ విప్లవంలో ఇదో కీలక మైలురాయి అని ఆయన అభివర్ణించారు. ఈ నూతన వంగడాన్ని భారత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించడం రాష్ట్రానికే గర్వకారణమని పవన్ కొనియాడారు. ఈ వినూత్న ఆవిష్కరణ వల్ల రైతులకు అధిక దిగుబడులు వచ్చి వారి ఆదాయం పెరుగుతుందని ఆకాంక్షించారు. దీనివల్ల ప్రజలకు కూడా ఎంతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# రెండు సూసైడ్ నోట్లలో సాదిక్ పేరు

**మతం మారాలన్న ఒత్తిడితోనే ఆత్మహత్యలు!**

**పది బృందాలతో గాలించి మీరట్‌లో అరెస్ట్ చేశాం**

**కేసు వివరాలు వెల్లడించిన కాకినాడ ఎస్పీ బిందుమాధవ్**

**కాకినాడ (సమయం న్యూస్):** ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసు దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన రెండు సూసైడ్ నోట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మతం మారాలంటూ రైఫిల్ షూటింగ్ కోచ్ సాదిక్ ఖాన్ చేసిన వేధింపుల వల్లే వీరు ఆత్మహత్యకు పాల్పడినట్లు లేఖల్లో పేర్కొన్నారని ఎస్పీ స్పష్టం చేశారు. కాకినాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ కేసు వివరాలను వెల్లడించారు. నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరి నదిలో దూకగా.. చిన్నారి ప్రాణాలతో బయటపడటం, మిగతా ముగ్గురు మృతి చెందడం తెలిసిందే. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్పీ చెప్పారు. నూకరాజు వద్ద ఒక లేఖ, సౌజన్య స్కూటీలో మరో లేఖ దొరికాయన్నారు. మతం మారాలని సౌజన్యపై సాదిక్ తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు ఆయన వెల్లడించారు.సౌజన్య మామ భాస్కర్ రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. నిందితుడి కోసం పది పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లో గాలించి, చివరకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేశామని తెలిపారు. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కాకినాడ తీసుకొచ్చామన్నారు. ఈ ఘటన తర్వాత పారిపోయిన సాదిక్.. తన ఫోన్, డబ్బులు పోయాయంటూ స్నేహితులకు అబద్ధాలు చెప్పి మీరట్‌లో ఆశ్రయం పొందాడని ఎస్పీ వివరించారు. నిందితుడిపై వస్తున్న మరికొన్ని ఆరోపణలపైనా విచారణ జరుపుతున్నామన్నారు.



సాదిక్‌పై హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయన్నారు. ఎవరైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు క్షణికావేశంలో ఆత్మహత్యల వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవద్దని, ధైర్యంగా పోలీసులను ఆశ్రయిస్తే పూర్తి అండగా ఉంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు. కాగా, సాదిక్ ఖాన్‌కు న్యాయస్థానం పద్నాలుగు రోజుల రిమాండ్ విధించడంతో కాకినాడ సబ్ జైలుకు తరలించారు. నిందితుడిని వారం రోజుల పాటు కస్టడీకి కోరుతూ పోలీసులు మంగళవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

# చంచల్‌గూడ జైలుకు కారుమూరి!

**ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో మాజీ మంత్రి అరెస్ట్**

**సెప్టెంబర్ 7 వరకు రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు**

**కారుమూరి పాత్రపై మరింత దర్యాప్తు అవసరమన్న ఈడీ**

**హైదరాబాద్ (సమయం న్యూస్):** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయిన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు నాంపల్లి కోర్టు రిమాండ్ విధించింది. ఆదివారం ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం కారుమూరిని నాంపల్లి కోర్టులో హాజరుపరిచిన దర్యాప్తు సంస్థ అధికారులు.. కేసు విచారణలో వెలుగులోకి వచ్చిన కీలక అంశాలను న్యాయమూర్తికి వివరించారు. ఈ స్కామ్‌లో కారుమూరి పాత్రపై లోతైన దర్యాప్తు అవసరమని వాదనలు వినిపించారు. ఏకీభవించిన న్యాయస్థానం సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఆయనకు రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాలతో అధికారులు కారుమూరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏపీ లిక్కర్ అక్రమ రవాణా కేసులో దర్యాప్తును వేగవంతం చేసిన అధికారులు.. ప్రధానంగా ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించారు. ఈ కేసులో మాజీ మంత్రి అరెస్ట్ కావడం ఏపీ రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉండనున్నారు. సెప్టెంబర్ 7 వరకు రిమాండ్ విధించిన నేపథ్యంలో.. ఈడీ తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోనుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



# రూ.7 కోట్లతో నిడదవోలుకు పుష్కర శోభ!

**2027 నాటికి సుందర నందనవనంగా పట్టణం**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కందుల దుర్గేష్**

**ఘాట్ల ఆధునికీకరణ, రహదారుల నిర్మాణానికి భారీ నిధులు**



**నిడదవోలు:** రాబోయే గోదావరి పుష్కరాల (2027) నాటికి నిడదవోలు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం పట్టణంలో రూ.7 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. చినకాశీరేవు తదితర ప్రాంతాల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను స్వయంగా పర్యవేక్షించారు. అన్నపూర్ణ నగర్ నుంచి చినకాశీరేవు వరకు రూ.35 లక్షలతో మెటల్ రోడ్డు పనులకు మంత్రి భూమిపూజ చేశారు. రైల్వే స్టేషన్ రోడ్డులో రూ.1.34 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డు, కాలువ, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ప్రారంభించారు. చినకాశీరేవులోని శివాలయాన్ని త్వరలోనే అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం రూ.2.50 కోట్లతో 11 ప్రధాన ఘాట్లను ఆధునికీకరిస్తున్నట్లు మంత్రి చెప్పారు. రహదారులు, ఆరు భారీ పార్కింగ్ స్థలాలు, 34 మరుగుదొడ్లు, తాగునీరు, సెంట్రల్ లైటింగ్, పిండ ప్రదాన షెడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించినట్లు వివరించారు. భక్తుల సౌకర్యార్థం రూ.4.47 కోట్ల రైల్వే నిధులతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూడా నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



# ధరల మంట

## పాలకులకు పట్టదా?

### నిత్యావసరాల నుంచి నిర్మాణ సామగ్రి వరకు భగ్గుమంటున్న ధరలు

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల రోజువారీ సమస్యలు పట్టడం లేదన్న భావన బలపడుతోంది. ఎన్నికలు వస్తే కొత్త పథకాలు, ఉచిత హామీలు, ఓటర్లను ఆకట్టుకునే ప్రకటనలు తెరపైకి వస్తున్నాయి. కానీ పేద, మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరుస్తున్న ధరల పెరుగుదలపై మాత్రం అదే స్థాయిలో చర్చ కనిపించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే అయినా, రాష్ట్రాల్లోని ప్రభుత్వాలైనా ధరల నియంత్రణకు నిరంతర పర్యవేక్షణ, సమగ్ర కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. నిత్యావసరాల నుంచి ఇంటి నిర్మాణ సామగ్రి వరకు ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతున్నాయి. బియ్యం, చక్కెర, బెల్లం, ఉల్లి, వెల్లుల్లి, ఎండుమిర్చి, వంటనూనెలు, పూలు, పండ్లు.. ఇలా ఏ వస్తువు ముట్టుకున్నా ధర షాక్ తగులుతోంది. సంపాదన అదే స్థాయిలో ఉండగా ఇంటి నెలవారీ బడ్జెట్ మాత్రం పెరుగుతుండటంతో మధ్యతరగతి కుటుంబాలు ఖర్చుల్లో కోత పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సన్నరకం బియ్యం ధర కిలో రూ.80 వరకు చేరడం సామాన్య కుటుంబాలను కలవరపెడుతోంది. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థపై ఒత్తిడి వంటి కారణాలను మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ వద్ద అవసరాలకు మించి సేకరించిన ధాన్యం భారీగా ఉన్నప్పటికీ దాన్ని సమర్థంగా మార్కెట్లోకి తీసుకొచ్చి ధరలను నియంత్రించగలిగామా అన్న ప్రశ్న తలెత్తుతోంది. చింతపండు ధర రూ.200 దాటుతోంది. చక్కెర ధర కూడా అనూహ్యంగా పెరిగింది. ఉల్లిగడ్డ ధర నెల వ్యవధిలోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22 నుంచి రూ.26 మధ్య ఉన్న ధర ఇప్పుడు రూ.45 నుంచి రూ.52 వరకు పలుకుతోంది. వెల్లుల్లి ధర రూ.120--130 నుంచి రూ.250 వరకు చేరింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కు ఎగబాకింది. లీటరు వంటనూనె ప్యాకెట్ రూ.175 వరకు చేరుతోంది. బెల్లం కిలో రూ.55 నుంచి రూ.70--75 వరకు పెరిగింది. ఇలాంటి సమయంలో చక్కెర ధర పెరిగినా మధుమేహం కారణంగా ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండదన్న తరహాలో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు వ్యాఖ్యానించడం సమస్య తీవ్రతను తక్కువ చేసి చూపడమే అవుతుంది. ధర పెరుగుదల ఒక్క వస్తువుతో ఆగిపోదు. టీ దుకాణం నుంచి మిఠాయి తయారీ వరకు దాని ప్రభావం ఇతర వస్తువుల ధరలపైనా పడుతుంది. బోనాలు, శ్రావణమాస పూజలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సమయంలో పూలకు డిమాండ్ పెరగడం సహజమే. కానీ ఆ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొన్ని ప్రాంతాల్లో ధరలను అమాంతం పెంచుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పూజకు పూలు, వంటకు సరుకులు, పెళ్లికి బంగారం.. ఏది కొనాలన్నా కుటుంబ బడ్జెట్‌ను ఒకటికి రెండుసార్లు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంగారం ధరలు పెళ్లిళ్లు చేసే కుటుంబాలకు మరింత భారంగా మారాయి. కనీస ఆభరణాలు, మంగళసూత్రం చేయించాలన్నా భారీ మొత్తం వెచ్చించాల్సి వస్తోంది. దీనికితోడు తయారీ చార్జీలు, తరుగు, పన్నులు కలిసేసరికి వినియోగదారుడిపై భారం మరింత పెరుగుతోంది. బంగారం కొనుగోలులో ధరలు, స్వచ్ఛత, తయారీ చార్జీల విషయంలో వినియోగదారులకు మరింత పారదర్శకత అవసరం. ఇల్లు కట్టుకోవాలనుకునే మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. సిమెంట్, ఉక్కు, ఇటుక, ఇసుక నుంచి కార్మికుల కూలీల వరకు నిర్మాణ వ్యయం పెరుగుతోంది. అప్పు చేసి చిన్న ఇల్లు కట్టుకోవాలనుకున్న కుటుంబాలు అంచనా వ్యయం పెరగడంతో పనులను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు మరో పెద్ద సమస్య. విద్య, వైద్యం, ఇంటి అద్దె, ప్రయాణం వంటి తప్పనిసరి ఖర్చులకు తోడు నిత్యావసరాల ధరలు పెరిగితే సామాన్యుడి సంపాదనలో పొదుపునకు చోటెక్కడ? ఉత్పత్తి తగ్గింది.. సరఫరా దెబ్బతింది.. వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు.. పండగల డిమాండ్ పెరిగింది.. అంటూ ధరల పెరుగుదలకు రోజుకో కారణం వినిపిస్తోంది. కానీ ప్రభుత్వాలు చేయాల్సింది కారణాలు చెప్పడం కాదు.. కారణాలను ముందుగానే గుర్తించి ధరల మంట సామాన్యుడికి తగలకుండా చూడటం. దేశంలో ఏ పంట ఎంత పండుతోంది? ఎంత వినియోగం ఉంది? ఎంత నిల్వ ఉంది? ఏ రాష్ట్రంలో కొరత ఏర్పడుతోంది? ఎక్కడ మిగులు ఉంది? సరఫరాలో ఎక్కడ ఆటంకం ఏర్పడుతోంది? అక్రమ నిల్వలు జరుగుతున్నాయా? కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అన్న అంశాలను నిరంతరం పర్యవేక్షించాలి. అవసరమైనప్పుడు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేయాలి. అక్రమ నిల్వదారులు, బ్లాక్ మార్కెటీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా, పండగలు, సెలవులు, రద్దీ సమయాల్లో టికెట్ ధరలు సామాన్యుడికి అందనంతగా పెరుగుతున్న సందర్భాలు ఉన్నాయి. విమానయాన రంగంలో పోటీ, సేవలు, ఛార్జీల తీరుపైనా ప్రభుత్వ పర్యవేక్షణ అవసరం. ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురావడం అంటే విమానాశ్రయాలు నిర్మించడం ఒక్కటే కాదు.. ఆ సేవలను భరించగలిగే స్థాయిలో ఉంచడం కూడా ముఖ్యమే. రాజకీయ పార్టీలు ఒకరి ఉచిత హామీలను మరొకరు విమర్శించుకోవడంలో చూపుతున్న ఆసక్తి ధరల పెరుగుదలపై కనిపించడం లేదు. అధికారంలో ఉన్నవారు తమ పథకాల గొప్పతనాన్ని ప్రచారం చేసుకుంటుంటే, ప్రతిపక్షాలు కూడా ప్రజల రోజువారీ జీవన వ్యయంపై నిర్మాణాత్మక చర్చకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. పార్లమెంటు, శాసనసభలు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకే పరిమితం కాకూడదు. బియ్యం ఎందుకు పెరిగింది? చక్కెర ఎందుకు ఎగబాకింది? ఉల్లి ధర ఎందుకు రెట్టింపైంది? వంటనూనెల ధరలను ఎలా తగ్గించాలి? అక్రమ నిల్వలను ఎలా అడ్డుకోవాలి? మధ్యతరగతి కుటుంబాల జీవన వ్యయాన్ని ఎలా తగ్గించాలి? అన్న అంశాలపై చర్చ జరగాలి. ఎన్నికల సమయంలో ఓటరే రాజు అని చెప్పే నేతలను.. ఎన్నికల మధ్యకాలంలోనూ ప్రజలే ప్రశ్నించాలి. ఉచితంగా ఏం ఇస్తారన్నదే కాదు.. సంపాదించిన రూపాయికి ఎంత విలువ మిగిలేలా పాలిస్తున్నారు? అని నిలదీయాలి. ఎందుకంటే సామాన్యుడికి కావాల్సింది ప్రకటనల ఉపశమనం కాదు.. మార్కెట్‌కు వెళ్లినప్పుడు కనిపించే నిజమైన ధరల ఉపశమనం.

# భారత్‌పై దాడులకు పాక్ కుట్రలు పన్నుతోందా?

- ఆయుధాలు సమీకరించుకుంటున్న పాకిస్థాన్!
- ఇస్లామిక్ కూటమితో బలపడే వ్యూహాలు
- టర్కీ నుంచి రహస్యంగా డ్రోన్లు, ఆయుధాల దిగుమతి
- మక్కా ఒప్పందంలోకి ఇరాన్‌కు ఆహ్వానం




**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** పాకిస్థాన్ ఇటీవల కాలంలో టర్కీ నుంచి భారీగా ఆయుధాలు దిగుమతి చేసుకుంటున్నట్లు నిఘా వర్గాలు పసిగట్టాయి. పాకిస్థాన్‌లోని కీలక వైమానిక స్థావరమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌కు టర్కీ సైనిక విమానాల రాకపోకలు అమాంతం పెరిగినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా సీ-130 హెర్క్యులెస్ విమానాలు రావల్పిండిలోని నూర్ ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు పదేపదే వచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆగస్టు 19 నుంచి 21 మధ్య టర్కీకి చెందిన పలు సీ-130 విమానాలు పాకిస్థాన్‌కు రావడంపై భారత నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి. ఈ విమానాల ద్వారా పాక్ భారీ ఎత్తున డ్రోన్లు, డ్రోన్ ఆధారిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రిని తరలించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు చైనా నుంచి కూడా పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ పొందినట్లు సమాచారం. ఆయుధాల దిగుమతిపై పాక్, టర్కీలు అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ.. టర్కీ డ్రోన్లపై పాక్ ఎప్పట్నుంచో ఆసక్తి చూపుతోంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో టర్కీ డ్రోన్లను భారత్‌పై ప్రయోగించగా.. వాటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. పాక్ వద్ద ఇప్పటికే బైరక్తార్ టీబీ-2 డ్రోన్లు ఉన్నాయి. ప్రస్తుతం పాక్ తన మానవరహిత వైమానిక సామర్థ్యాలను పెంచుకోవడంపై తీవ్రంగా దృష్టి సారించింది. ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లాయిటరింగ్ మ్యూనిషన్ లాంటి వ్యవస్థలను సమకూర్చుకుంటోంది. మరోవైపు పశ్చిమాసియాలో ఘర్షణల వేళ.. పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. 'నాటో' తరహాలో 'సభ్య దేశాల్లో ఏ ఒక్కదానిపై దాడి జరిగినా.. అది తమందరిపై జరిగిన దాడిగానే మిగతా దేశాలు భావిస్తాయి' అనే నిబంధనను ఈ ఒప్పందంలో చేర్చారు. అణ్వస్త్ర దేశమైన పాకిస్థాన్, నాటో సభ్య దేశమైన టర్కీ, చమురు నిల్వలతో సుసంపన్నమైన సౌదీ అరేబియాల మధ్య కుదిరిన ఈ సంయుక్త రక్షణ ఒప్పందం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఒప్పందంలో చేరాల్సిందిగా ఇరాన్‌కు కూడా ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. తమకు అందిన ఆహ్వానంపై సమీక్ష జరుపుతున్నామని, ఇది టెహ్రాన్‌కు దక్కిన విజయమని ఇరాన్ కీలక నేత మొహమ్మద్ రహిమీ పేర్కొన్నట్లు పశ్చిమాసియాలోని మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఇరాన్ విదేశాంగ శాఖ ఈ ఆహ్వానాన్ని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. సౌదీ అరేబియాకు, ఇరాన్ మద్దతు గల హౌతీ గ్రూపులకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొన్న వేళ ఇరాన్‌కు ఈ ఆహ్వానం వెళ్లడం ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఇరాన్ ఈ మక్కా ఒప్పందంలో చేరితే.. తన మద్దతుదారులైన హౌతీలపైనే దాడులు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి పశ్చిమాసియాలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఈ ప్రాంత దేశాలు అమెరికా రక్షణ ఛత్రం నుంచి క్రమంగా బయటకు రావాలని చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రమంలో ఇరాన్‌కు అందిన ఆహ్వానం ఏ మేర ఫలిస్తుందో వేచి చూడాలి.

# గో స్మగ్లర్లపై పోలీసుల తూటా!

### మీరట్‌లో పోలీసులకు, స్మగ్లర్లకు మధ్య కాల్పులు

### ఎదురుకాల్పుల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు



**ఉత్తర్‌ప్రదేశ్, ఆగస్టు 24:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో గోవుల అక్రమ రవాణా, గోవధకు పాల్పడుతున్నారన్న సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులకు, అనుమానిత స్మగ్లర్లకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో తస్లీమ్, భూరా అనే ఇద్దరు నిందితులు తీవ్రంగా గాయపడ్డారు. మీరట్‌లోని ఓ ప్రాంతంలో కొందరు గోవులను అక్రమంగా తరలించడంతో పాటు గోవధకు పాల్పడుతున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సంఘటన స్థలంలో ఓ గోవు చెట్టుకు కట్టేసి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులను గమనించిన తస్లీమ్, భూరా కాల్పులకు దిగారని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరిపినట్లు తెలిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరూ గాయపడగా వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మరో నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు చెబుతున్నారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. తస్లీమ్‌పై ఇప్పటికే 15 కేసులు, భూరాపై 10 కేసులు ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కేంద్రంపై సీజేపీ సమరశంఖం!

### సెప్టెంబర్ 5న ఇండియా గేట్ వద్ద భారీ నిరసన

### జెన్ జీని సర్కార్ మోసగించిందని తీవ్ర ఆగ్రహం

**న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ ఉదంతంపై దేశవ్యాప్తంగా ఉద్యమించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ).. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఢిల్లీలో మరో భారీ ఆందోళనకు సిద్ధమైంది. సెప్టెంబర్ 5వ తేదీన ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించనున్నట్లు పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ ప్రకటించారు. నీట్ బాధితులకు పరిహారం, ఎఫ్ఐఆర్ ల తొలగింపు విషయంలో కేంద్రం జెన్ జీని దారుణంగా మోసగించిందని విమర్శించారు. జులై 25న ఇచ్చిన హామీలను సర్కార్ గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఈ మార్చ్ లో ఆత్మహత్య చేసుకున్న అభ్యర్థుల కుటుంబాలతో పాటు పోలీసుల దౌర్జన్యానికి గురైన బాధితులు పాల్గొంటారని స్పష్టం చేశారు.



### బడుల దుస్థితిపై ప్రశ్నల వర్షం..

దేశంలో ప్రభుత్వ బడుల దైన్యంపై సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు లేని పాఠశాలలతో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సోమవారం లేఖ రాశారు. గత ఐదేళ్లలో ఎన్ని బడులు బాగుచేశారు, ఎన్ని నిధులు కేటాయించారు, ఇంకా ఎన్ని టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయో వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బడుల్లో డిజిటల్ తరగతులు, మరుగుదొడ్లు, ఆటస్థలాల పరిస్థితిపై కేంద్రాన్ని నిలదీశారు. టీచర్లకు బోధనేతర విధులు ఎంతవరకు అప్పగించారో చెప్పాలన్నారు. తాను రాజకీయం కోసం కాకుండా.. కేవలం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే ఈ లేఖ రాసినట్లు ఆయన స్పష్టం చేశారు.

# సింఘేశ్వర ఆలయం వద్ద తోపులాట

### ఆరుగురు భక్తులకు గాయాలు

### శ్రావణ సోమవారం కావడంతో ఆలయానికి పోటెత్తిన జనం

### అకస్మాత్తుగా కూలిన బారికేడ్.. భయాందోళనలో భక్తులు

### గత వారమే లఖిసరాయ్ ఘటనలో ఏడుగురు మృతి



**బిహార్, ఆగస్టు 24:** బిహార్: మధేపురాలోని సింఘేశ్వర ఆలయం వద్ద సోమవారం ఉదయం తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. శ్రావణ సోమవారం కావడంతో సింఘేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అయితే, భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు ఏర్పాటు చేసిన ఓ బారికేడ్ అకస్మాత్తుగా కూలిపోయింది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే తొక్కిసలాట వంటి పరిస్థితి నెలకొంది. ఒకరినొకరు తోసుకోవడంతో సుమారు ఆరుగురు భక్తులు గాయపడ్డారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం మధేపురాలోని జననాయక్ కర్పూరి ఠాకూర్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అయితే, ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ, మేజిస్ట్రేట్ అభిషేక్ రంజన్ సహా ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరోవైపు, అదనపు బలగాలను కూడా మోహరించారు. పరిస్థితిని వెంటనే అదుపులోకి తీసుకువచ్చారు. అధికారులు నిర్దేశించిన మార్గదర్శకాలను భక్తులు పాటించాలని, ప్రశాంతంగా ఉండాలని ఆలయ ట్రస్ట్ కమిటీ కోరింది. కాగా, గత సోమవారం లఖిసరాయ్ జిల్లాలోని అశోక్ ధామ్ ఆలయం వద్ద తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. భారీ జనసందోహానికి తోడు విద్యుత్ స్తంభం కూలిపోయిందనే వదంతి కారణంగా తొక్కిసలాట జరిగినట్లు అధికారులు తెలిపారు.

## అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే

# అంతే సంగతులు

### ఒక్కచుక్క చమురును కూడా సరఫరా కానివ్వం

### ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 24 :** అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీ-డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.



# ఫారెస్ట్ నర్సరీలో రైతులకు పండ్ల, సహజ మొక్కల పంపిణీ





ఐటీసీ బంగారు భవిష్యత్ వారి సహకారంతో, సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుట్టాయిగూడెం ఫారెస్ట్ నర్సరీలో రైతులకు పండ్ల మొక్కలు మరియు సహజ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన రైతులకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మూర్తి మాట్లాడుతూ, ఐటీసీ బంగారు భవిష్యత్ సహకారంతో రైతులకు అందిస్తున్న పండ్ల మొక్కలను ప్రతి రైతు బాధ్యతగా సంరక్షించి, అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పండ్ల మొక్కల పెంపకం ద్వారా భవిష్యత్తులో రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఈ అవకాశం కల్పిస్తున్న ఐటీసీ సంస్థను ఆయన అభినందించారు.ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గీతా ప్రవళిక మాట్లాడుతూ, రైతులు తమ సాధారణ వ్యవసాయంతో పాటు పండ్ల మొక్కలను పెంచుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో పండ్ల మొక్కలు, సహజ మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంపిణీ చేసిన ప్రతి మొక్కను సంరక్షించి, మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మూర్తి గారు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బుచ్చిరాజు గారు మరియు అటవీ శాఖ సిబ్బంది, గొమ్ముకొత్త గూడెం ఎంపీటీసీ పాయం దేవి గారు, ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గీతా ప్రవళిక గారు, సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ ప్రాజెక్టు ఆఫీసర్ సతీష్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ గణేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు రజాక్, నాగేశ్వరరావు, రాము, సురేష్, వీరబాబు తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# ఏఈ నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలి

**సాదిక్ ఖాన్ పై కఠిన చర్యలు తీసుకోవాలి**

**రాష్ట్ర డీజీపీ, హోంమంత్రి స్పందించాలి: బీజేపీ నేతలు అడబాల, కబర్ధి, నల్లా పవన్**



ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని భారతీయ జనతా పార్టీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర మీడియా ప్రతినిధి ఉన్నమట్ల కబర్ధి, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బీజేపీ నేతలతో కలిసి అమలాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి వంచన, మోసం, బెదిరింపులు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు ఇటువంటి కేసులను కేవలం ప్రేమ, ఆర్థిక వ్యవహారాల కోణంలో మాత్రమే చూడటం వల్ల బాధితులు పోలీస్ స్టేషన్లకు వెళ్లేందుకు వెనుకాడుతున్నారని ఆయన అన్నారు. ఫిర్యాదుల సమయంలో బాధితుల వ్యక్తిగత విషయాలపై ప్రశ్నించడం, కేసులు నమోదు చేయకుండా కౌన్సెలింగ్ పేరుతో పంపించడం వంటి చర్యల వల్ల బాధితులకు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యువతులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఘటనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇటువంటి ఘటనలకు సంబంధించి సామాజిక మాధ్యమాలు, విద్యా సంస్థలు, శిక్షణా కేంద్రాలు, జిమ్‌లు, జుంబా డాన్స్ సెంటర్లు, సెలూన్లు, బ్యూటీ పార్లర్లు, కార్పొరేట్ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న వ్యవహారాలపై కూడా పోలీసులు నిఘా పెట్టాలని అన్నారు. ఏఈ నూకరాజు కుటుంబానికి సంబంధించిన ఘటన చాలా తీవ్రమైనదని, విచారణలో వెలుగులోకి వచ్చే ప్రతి అంశాన్ని పోలీసులు నిష్పక్షపాతంగా పరిశీలించాలని అడబాల సత్యనారాయణ, నల్లా పవన్ కోరారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి లభించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఆర్థిక లావాదేవీలు, బెదిరింపులు, ఆస్తులకు సంబంధించిన వ్యవహారాలు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న సాదిక్ ఖాన్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, కేసులోని అన్ని కోణాలను దర్యాప్తు సంస్థలు పరిశీలించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి ఘటనలపై నమోదైన ఫిర్యాదులు ఎన్ని, ఎన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి, ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి అనే వివరాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని కోరారు. రాష్ట్ర డీజీపీ, హోంశాఖ మంత్రి ఈ ఘటనపై స్పందించి సమగ్ర దర్యాప్తుకు ఆదేశించాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, జనతా వారధి కన్వీనర్ చీకరమెల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి డీవీఎస్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రమా వర్మ, పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా, జిల్లా మహిళా మోర్చా ప్రధాన ప్రధాన కార్యదర్శి కొండేటి జయలక్ష్మి, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మొహబూబా, జిల్లా కార్యవర్గ సభ్యులు కుడుపూడి చంద్రశేఖర్, బొచ్చు ప్రభాకర్, దాకే వెంకట్రావు, రావూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సంధ్యారాణి అరకు పర్యటన.

**అభివృద్ధి పనుల ప్రారంభం,**

**సీఎం పర్యటన ఏర్పాట్ల సమీక్ష.**





**అనంతగిరి/అరకు వ్యాలీ ఆగస్టు 24**

అల్లూరి జిల్లా అరకు నియోజకవర్గంలో గిరిజన సంక్షేమ,మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విస్తృతంగా పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు,త్వరలో జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి సమీక్షించారు.

**రూ. 35 లక్షలతో ప్రసూతి నిరీక్షణ కేంద్రం ప్రారంభం**

మండలంలోని సుంకరిమెట్ట గ్రామంలో రూ.35 లక్షల ఐటీడీఏ నిధులతో నిర్మించిన ప్రసూతి నిరీక్షణ కేంద్రం ను మంత్రి ప్రారంభించారు. మారుమూల ప్రాంతాల గర్భిణీలకు ప్రసవానికి వారం రోజుల ముందే సురక్షిత వసతి,మౌలిక సదుపాయాలు అందించడమే దీని లక్ష్యమని, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత విస్తరిస్తామని మంత్రి తెలిపారు.

**రూ. 79 లక్షలతో నిర్మించిన రహదారి ప్రారంభం:**

అనంతరం లోతేరు పంచాయతీ బొరాకలవలస గ్రామంలో రూ.79 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన రహదారిని మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు.228 మంది జనాభా కలిగిన ఈ గ్రామానికి రోడ్డు వసతి కలగడం ద్వారా విద్య,వైద్యం,వ్యవసాయ అవసరాలకు రవాణా సులువవుతుందని,గిరిజన ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు.

**ఆగస్టు 29న సీఎం చంద్రబాబు పర్యటన -- ఏర్పాట్ల పరిశీలన:**

ఆగస్టు 29న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరకు రానున్న నేపథ్యంలో హెలిప్యాడ్, సభా స్థలి మరియు గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లను మంత్రి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం హరిత రిసార్ట్స్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనకు వచ్చే ప్రజలకు భద్రత,పార్కింగ్, తాగునీరు వంటి వసతుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ టి. నిశాంతి,జాయింట్ కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ,టీడీపీ జిల్లా ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి,వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు గంగులయ్య,కె.శ్రవణ్ కుమార్,దొన్ను దొర,జీసీసీ డైరెక్టర్ బి.నాగరాజు మరియు ఇతర అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్షిప్‌లో ఏలూరు జిల్లా క్రీడాకారులకు అభినందనలు :-

**రాష్ట్ర క్రీడా ప్రాధికార డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి**

అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటిలలో ఏలూరు జిల్లా నుంచి వాలీబాల్ బాలబాలికల జట్లు పాల్గొనడం అభినందనీయమని రాష్ట్ర స్పోర్ట్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. రాష్ట్ర స్థాయి వేదికపై ఏలూరు జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనడం ఎంతో సంతోషకరమన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రమశిక్షణ, పట్టుదల, సమిష్టి కృషితో ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా వాలీబాల్ బాలబాలికల జట్లు భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు, కోచ్‌లకు, తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తూ, వారి భవిష్యత్ విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. జగదీశ్వరితో పాటు డైరెక్టర్ శ్రీ రమణ శ్రీమతి రజని పాల్గొన్నారు...




## రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమంపై టీడీపీ డోర్ టు డోర్ కార్యక్రమం



సోంపల్లి గ్రామంలో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమానికి రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి, రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె పలు ఇళ్లను సందర్శించి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను తెలియజేస్తూ, తెలుగుదేశం పార్టీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు) గారు, రాజోలు మండల పార్టీ అధ్యక్షులు అనుచూరి పురుషోత్తం గారు, వైస్ ఎంపీపీ పొలమూరు శాంబాబు గారు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ లంకే శ్రీనివాసరావు గారు, గ్రామ కమిటీ అధ్యక్షులు గాడి పాపయ్య గారు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యాలను వెలికితీసే కార్యక్రమం..

**అమరావతి ఛాంపియన్ షిప్**

**క్రీడ ప్రాధికార చైర్మన్ అనిమిని రవి నాయుడు**

**ఏపీ స్పోర్ట్స్ ఆథారిటి డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్షిప్ ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పోటీలు నేడు తిరుపతి పట్టణంలో రాష్ట్ర క్రీడ ప్రాధికార చైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించబడింది. ఈ వేదికలో లిరాష్ట్ర క్రీడా ప్రాధికార డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాలుపంచుకున్నారు. అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలు ఎస్వీ యూనివర్సిటీ స్టేడియం లో హట్టహాసంగా జరిగిన అమరావతి ఛాంపియన్షిప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర హోం మంత్రి వర్యులు వంగలపూడి అనిత రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు అనగాని సత్యప్రసాద్ రోడ్డు రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శాసన సభ సభ్యులు, శాసన మండలి సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థాన సభ్యులు, రాష్ట్ర క్రీడ ప్రాదికార డైరెక్టర్లు, 26 జిల్లా డి ఎస్డి ఓ ,పీడీ ,పి ఈ టీ ఎస్ 10000 వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజా పరిషత్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న - ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంపీటీసీ సభ్యుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జనరల్ బాడీ సమావేశం ప్రస్తుత ఎంపీటీసీ సభ్యులకు చివరి సమావేశం కానుందని ఎమ్మెల్యే తెలిపారు. తమ పదవీకాలంలో ప్రజలకు సేవలందించిన ఎంపీటీసీ సభ్యులను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమావేశంలో చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని అయన సూచించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ తరఫున ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ని ఘనంగా సత్కరించారు. అదే విధంగా ఎమ్మెల్యే కూడా ఎంపీటీసీ సభ్యులను సత్కరించి, వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు,ఎంపీపీ , ఎంపీటీసీ సభ్యులు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.ల

## వాలసి పాఠశాల ప్రహరీ గోడ పనులు పూర్తి చేయాలి.



అల్లూరి జిల్లా అనంతగిరి మండలం వాలసి ఎంపి యూ పి పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం పదేళ్లుగా అసంపూర్తిగా ఉండడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.1 నుండి 8వ తరగతి వరకు 108 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాల భవనాలు రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి.రక్షణ గోడ లేకపోవడంతో విరామ సమయాల్లో పిల్లలు రోడ్డుపైకి వచ్చి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.ఉపాధి హామీ సమగ్ర శిక్షా నిధులు కలిపి రూ.14.20 లక్షలు కేటాయించినప్పటికీ,కాంట్రాక్టర్లు కేవలం పునాదులతోనే పనులు నిలిపివేశారు. అధికారులు,కాంట్రాక్టర్లు కుమ్మక్కై నిధులు దుర్వినియోగం చేశారని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.అల్లూరి జిల్లా కలెక్టర్ స్పందించి దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని,వెంటనే ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో ప్రమాదాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

శాంతి కుదర్చాల్సిన వేదికే, వైరుధ్యాలను, పగను బహిరంగంగా బయటపెట్టిందన్నది ఒక వైరుధ్యం. తమిళనాడులోని కోవళంలో జరిగిన 31వ దక్షిణాది మండలి సమావేశం, నీటి విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ఎప్పటికైనా ఏకాభిప్రాయానికి రాగలవా? అన్న సందేహాన్ని మరింత బలపరిచింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన మహాబలిపురం సమీపంలోని కోవళం బీచ్ రిసార్టులో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరి ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రాల మధ్య మెరుగైన సహకారం కోసం అమిత్ షా వాదిస్తున్నా, ఆయన సందేశాన్ని వినడానికి ముఖ్యమంత్రులు సిద్ధంగా లేరు. బదులుగా తమ తమ రాష్ట్రాల దీర్ఘకాలిక డిమాండ్లను గట్టిగా వినిపించారు. దీంతో దక్షిణాది మండలి ఒక కాలం చెల్లిన వేదికగా మిగిలిపోయిందా? అన్న సందేహం కలుగుతుంది. 2014 నుంచి తమ ముందుకు వచ్చిన 1,869 అంతర్రాష్ట్ర వివాదాల్లో 1,445 పరిష్కరించామని, అంటే 80 శాతం విజయ రేటు సాధించామని అమిత్ షా చెప్పుకున్నారు. కానీ కోవళంలో గురువారం జరిగిన చర్చలు చూస్తే, భవిష్యత్తులో ఆ రేటు కొనసాగుతుందా? అన్న సందేహం కలగకమానదు. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిపాలనాధికారుల సమావేశంలో లేవనెత్తిన అంశాలు, గత దశాబ్దాలుగా అల్లర్లు, ఆందోళనలు, సుదీర్ఘ న్యాయపోరాటాలు, హింసకు కూడా కారణమైన అదే పాత విద్వేషాల నుంచి పుట్టుకొచ్చినవే కావడం గమనార్హం – రాజకీయ నాయకులు అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోరన్న సత్యాన్ని ఇది మరోసారి రుజువు చేస్తోంది.

1979లో మొదటిసారి లేవనెత్తిన డిమాండ్‌ను కేరళ ఇప్పటికీ వదులుకోలేదు – తమ భూభాగంలో ఉన్న 120 ఏళ్ల నాటి ముల్లపెరియార్ డ్యామ్‌ను కూల్చివేయాలని, అయితే ఇది తమిళనాడులోని ఎండిపోయిన జిల్లాలకు నీరు అందిస్తోందని కేరళ వాదిస్తోంది. కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ఇప్పుడు కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు – కొత్త ముల్లపెరియార్ డ్యామ్ నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా కేరళే భరిస్తుందని, డిజైన్, స్థానం, నిర్మాణ బాధ్యతలను తమిళనాడే చూసుకోవచ్చని ఆయన ప్రతిపాదించారు. అయితే, న్యాయపరమైన నిర్ణయాల ప్రకారమే నీటిమట్టాన్ని 152 అడుగులకు పెంచే భద్రతా ప్రమాణాలు కొనసాగాలని, ఏ ఎగువ ప్రాంత జోక్యమైనా మరో రాష్ట్ర న్యాయబద్ధమైన వాటాను ప్రభావితం చేసే అవకాశం ఉంటే అది చట్టపరమైన, సంస్థాగత చట్రంలోనే జరగాలని తమిళనాడు ముఖ్యమంత్రి సీ. జోసెఫ్ విజయ్ స్పష్టం చేశారు. అదేవిధంగా, కావేరి నదీ జలాల పంపిణీపై తమిళనాడుతో దీర్ఘకాలంగా తగవులాడుతున్న కర్ణాటక, మేకెదాటు వద్ద కావేరిపై మరో డ్యామ్ నిర్మించాలని పట్టుబట్టింది. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఈ ప్రాజెక్టు తమిళనాడు, పుదుచ్చేరి రైతులకు కూడా ప్రయోజనం చేకూరుస్తుందని, నదీ జలాల్లో 5 టీఎంసీ మినహా మిగతావన్నీ సహజంగానే తమిళనాడులోకి ప్రవహిస్తాయని హామీ ఇచ్చారు, నీటి పంపిణీ సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని హోంమంత్రిని కోరారు. అయితే, పర్యావరణవేత్తలు దీన్ని పర్యావరణ విపత్తుగా భావిస్తుండగా, తమిళనాడు దీన్ని తమకు రావాల్సిన చివరి నీటిబొట్టును కూడా అడ్డుకునే యత్నంగా చూస్తోంది – వివిధ వర్గాల నుంచి

## వియ్యం! కయ్యం!!


దీనికి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, కోవళం సమావేశంలో కర్ణాటక తన ప్రాజెక్టుకే కట్టుబడి ఉంది, ఇది తమిళనాడు నీటి కొరతను పరిష్కరించడానికి కూడా సాయపడుతుందని అంచనా వేయడం విశేషం. కోర్టు తీర్పులు, ట్రిబ్యునల్ నిర్ణయాలకు అన్ని రాష్ట్రాలూ కట్టుబడి ఉండాలని తమిళనాడు పట్టుబట్టడంతో, కావేరి నీటి నిర్వహణ ప్రాధికార సంస్థ నిర్ణయాలను సకాలంలో అమలు చేయాలని విజయ్ నొక్కిచెప్పారు. కృష్ణా నదీ జలాల వివాదాన్ని ఆంధ్రప్రదేశ్‌తో పరిష్కరించాలని, దిగువ ప్రాంత హక్కులను చట్టపరమైన చట్రంలోనే రక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి–కావేరి నదుల అనుసంధానం ద్వారా 500 టీఎంసీలకు పైగా నీటిని తమిళనాడుకు తరలించే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు సమన్వయంతో పనిచేయాలన్నారు.

గత తరాల నాయకుల కాలంలో మొదలైన ఈ వివాదాలు, పలు కోర్టు జోక్యాలు, శాంతి కార్యక్రమాలు జరిగినా, దక్షిణాది మండలి వంటి ఉమ్మడి వేదికలపై ఇప్పటికీ ప్రతిధ్వనిస్తుండటం ఒక విషాదమే –ఆధునిక కాలపు నాయకులు కూడా, సామాన్య

## సంపాదకీయం

ప్రజల అవసరాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం కంటే, పోరాటాలను కొనసాగించడంపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్టు కనిపిస్తోంది. కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ వివాదాలు, ఇప్పటి తరం ముఖ్యమంత్రుల మధ్యే కొత్త రూపంలో ప్రతిబింబిస్తున్నాయి. చిత్రమేమిటంటే, ఇదే సమావేశంలో డీలిమిటేషన్ అంశం కూడా చర్చకు వచ్చింది. 1971 జనాభా లెక్కల ఆధారంగా వచ్చే 25 ఏళ్లపాటు లోక్‌సభ స్థానాల సంఖ్యను 543కే పరిమితం చేయాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేయాలని కర్ణాటక సీఎం శివకుమార్ మండలిని కోరారు. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో మెరుగ్గా పనిచేసినందుకు శిక్షించబడకూడదన్న ఆందోళన ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది. "సొంత రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో తప్పేమీ లేదు, కానీ ఆ ప్రయోజనాలను కాపాడుకోవడం వల్ల ఇతర రాష్ట్రాలు నీటిని పొందలేకపోతే, అది సమస్యే" అని సహకార పరిష్కారాలను కనుగొనాలని అమిత్ షా నేతలకు విజ్ఞప్తి చేశారు. ఈ మాటల్లో నిజాయితీ ఉన్నా, ఆచరణలో అది ఎంతవరకు సాధ్యమవుతుందన్నదే అసలైన ప్రశ్న. మహానదులను అనుసంధానించాలన్న ఆలోచన మరోసారి తెరపైకి వచ్చినా, ఇలాంటి బృహత్తర ప్రాజెక్టులు గాలిలో మేడలు కట్టడం లాంటివేనని గత అనుభవాలు చెబుతున్నాయి. రాజకీయ నాయకులు తమ రాష్ట్రాల న్యాయమైన హక్కులను కాపాడుకోవడం సహజమే అయినా, పరస్పర విశ్వాసం, శాస్త్రీయ ఆధారాలు, దీర్ఘకాలిక దృక్పథం లేకుండా కేవలం రాజకీయ ప్రకటనలతో, ప్రతిపాదనలతో ఈ దశాబ్దాల నాటి వివాదాలు పరిష్కారమవుతాయని ఆశించడం అత్యాశే. దక్షిణాది మండలి నిజమైన అర్థంలో సహకార సమాఖ్యవాదానికి వేదికగా మారాలంటే, రాష్ట్రాలు తమ రాజకీయ కోణాలను పక్కనబెట్టి, శాస్త్రీయ, న్యాయబద్ధమైన పరిష్కారాల దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీటి కోసం జరిగే ఈ యుద్ధాలు దశాబ్దాలుగా మారని ముఖచిత్రమే. రాజకీయ నాయకులు మారినా, వివాదాల మూలాలు మారడం లేదు. నిజమైన సహకార సమాఖ్యవాదం సాకారం కావాలంటే, ప్రకటనలు కాదు, చిత్తశుద్ధితో కూడిన చర్యలే కావాలి!

## పనికొచ్చే పలుకు



## మారాల్సింది.. ఆలోచనా ధోరణి

మనం ఒక పనిని "తప్పనిసరిగా చేయాలి" అనుకున్నప్పుడు, అది ఒక భారంలా అనిపిస్తుంది. కానీ అదే పనిని "చేసే అవకాశం నాకు దక్కింది" అని అనుకుంటే, అది కృతజ్ఞతలా మారుతుంది. ఈ చిన్న దృక్పథ మార్పు వెనుక దాగివున్న శక్తిని చాలామంది గుర్తించరు. ఒకే పని, ఒకే బాధ్యత –కానీ దాన్ని చూసే కోణం మారితే, దాని ప్రభావం మన మనసుపై పూర్తిగా మారిపోతుంది. ఉదయాన్నే లేచి పిల్లలను స్కూలుకు తయారు చేయడం, ఆఫీసుకు వెళ్లడం, తల్లిదండ్రుల ఆరోగ్య బాధ్యతలు చూసుకోవడం –వీటన్నింటినీ "చేయాల్సిందే" అనుకుంటే విసుగు పుడుతుంది. కానీ "ఇవన్నీ చేయగలిగే శక్తి, అవకాశం నాకు ఉంది" అనుకుంటే, అదే పని తృప్తినిస్తుంది.

ఈ ఆలోచనకు మద్దతుగా అమెరికన్ రచయిత్రి మెలొడీ బీటీ ఇలా అంటారు: Gratitude turns what we have into enough. అంటే, కృతజ్ఞతా భావం మన దగ్గరున్నదాన్నే సరిపడేదిగా మారుస్తుంది. ఈ ఒక్క వాక్యంలో జీవితాన్ని మార్చే శక్తి దాగివుంది. మనకు ఏది లేదో దానిపై దృష్టి పెడితే అసంతృప్తి పెరుగుతుంది. మన దగ్గర ఏముందో దానికి కృతజ్ఞత చూపిస్తే తృప్తి పెరుగుతుంది. ఇదే సూత్రాన్ని మన దైనందిన బాధ్యతలకు అన్వయిస్తే, జీవితం పూర్తిగా కొత్త కోణంలో కనిపిస్తుంది.

ఇవాళ మనం విసుక్కుంటూ చేసే ఎన్నో పనులను ఒక్కసారి గుర్తుచేసుకోండి. పిల్లలతో గడపడం, వారి హోంవర్క్ చూడటం, తల్లిదండ్రులతో సమయం గడపడం, ఆరోగ్యంగా ఉన్నప్పుడు రోజువారీ పనులు చేయగలగడం. వయసు పైబడిన తర్వాత, శరీరం సహకరించని రోజుల్లో, లేదా ఆ మనుషులే మన పక్కన లేని సమయంలో, ఈ రోజు మనం విసుక్కుంటున్న పనులనే మళ్లీ ఒక్కసారైనా చేయగలిగితే బాగుండని కోరుకుంటాం. ఇదే జీవితంలోని పెద్ద వైరుధ్యం. మనం కలిగివున్నప్పుడు దాని విలువ తెలియదు, కోల్పోయాక మాత్రమే దాని ప్రాముఖ్యత అర్థమవుతుంది.

ఈ ఆలోచనా ధోరణి మార్పు మన లైఫ్‌స్టయిల్‌ను ఎలా మారుస్తుందో పరిశీలిస్తే –మొదటిది, ఒత్తిడిస్థాయి గణనీయంగా తగ్గుతుంది. "చేయాలి" అనే ఒత్తిడితో కూడిన భాష బదులు, "చేసే అవకాశం ఉంది" అనే కృతజ్ఞతా భావంతో కూడిన భాషను వాడితే, మెదడులో ఒత్తిడి హార్మోన్ల విడుదల తగ్గుతుందని మానసిక శాస్త్ర పరిశోధనలు చెబుతున్నాయి. రెండోది, సంబంధాలు మెరుగుపడతాయి. మీ కుటుంబ సభ్యులతో గడిపే ప్రతి క్షణాన్ని భారంగా కాకుండా అవకాశంగా చూస్తే, ఆ సమయంలో మీరు మరింత ప్రేమతో, ఓపికతో ఉంటారు. మూడోది, పని నాణ్యత పెరుగుతుంది. కృతజ్ఞతతో చేసే పనిలో మరింత శ్రద్ధ, సృజనాత్మకత కనిపిస్తుంది.

ఈ చిన్న మార్పును అలవాటు చేసుకోవడానికి ఒక సులభమైన పద్ధతి ఉంది. ప్రతిరోజూ ఉదయం, మీరు చేయాల్సిన పనుల జాబితాను చూసినప్పుడు, ప్రతి పని ముందు మనసులో "నాకు ఈ అవకాశం దక్కింది" అని చెప్పుకోండి. మొదట్లో కృత్రిమంగా అనిపించినా, క్రమంగా ఇది మీ సహజ ఆలోచనా విధానంగా మారిపోతుంది. గుర్తుంచుకోండి –జీవితంలో ఏది మారకపోయినా, దాన్ని చూసే మీ దృక్పథం మారితే, అదే జీవితం పూర్తిగా భిన్నంగా అనుభూతి చెందుతుంది. మారాల్సింది పరిస్థితులు కాదు, మన ఆలోచనా ధోరణే.

# మాయమవుతున్న మౌనరోగం!




జూన్ 6న జంతర్‌మంతర్ నుంచి మొదలై దేశవ్యాప్తంగా వేగంగా వ్యాపించిన 'కాక్రోచ్' (బొద్దింకలు), 'దిమాగీ నక్సల్స్' ఉద్యమం, భారత రాజకీయ కథనాన్నే శాశ్వతంగా మార్చేసింది. ఈ ఉద్యమం సృష్టించిన మార్పును ఇప్పుడు ఎవరూ తిరగరాయలేరు. నేటి వాస్తవ పరిస్థితిని చూస్తే, "ఇదేం జరిగింది? ఎప్పుడు జరిగింది? ఎలా జరిగింది?" అని ఆశ్చర్యంతో ప్రశ్నించుకోవాల్సిన స్థాయిలో పరిస్థితులు మారిపోయాయి. ఇది అద్భుతమేనా? దీని ఘనత భారత యువతదేనా? నిస్సందేహంగా అవుననే సమాధానం చెప్పాలి. ఈ విజయం అసలైన ఆచరణాత్మక పరంగా ఏమిటో లెక్కగట్టడం ఇంకా తొందరపాటే అయినా, నైతికంగా, మానసికంగా మాత్రం ఇది స్పష్టమైన విజయమే. ఇది ఒక ఆలోచనా విప్లవానికి నాంది కాగలదా? పిల్లలకు మెరుగైన విద్య అందించాలన్న తమ లక్ష్యాన్ని బొద్దింకలు, దిమాగీ నక్సల్స్ సాధించగలరా? లేక విజయం తెచ్చిన మత్తు, కీర్తి వాసన నాయకులను, వారి అనుచరులను దారి తప్పిస్తుందా? ఈ స్థాయి విజయం రుచి చూడటం, మొదట్లో గట్టిగా డిమాండ్ చేసిన విద్యా సంస్కరణల కోసం మరింత దృఢంగా పనిచేసేలా వారిని ప్రేరేపించవచ్చు, లేదా కీర్తి, ఆరాధన అలల్లో వారు కొట్టుకుపోవచ్చు. ప్రస్తుతానికి మాత్రం, లక్షలాదిమంది కోరుకున్నా, గొంతెత్తే ధైర్యం లేని దాన్ని వీరు సాధించారు కాబట్టి, వారి విజయ క్షణాన్ని వారికి దక్కనివ్వాలి. సింపుల్‌గా చెప్పాలంటే.. 'సర్కార్‌ను కుదిపేశారు'!

ఇప్పుడు ఈ ధ్వని అవరోధాన్ని జెన్–జీ మాత్రమే కాదు, జెన్ ఆల్ఫా కూడా ధైర్యంగా ఛేదించిన తర్వాత, భారత్ సమష్టి మౌనరోగం (లారింగైటిస్) నయమైందని నిశ్చింతగా భావించవచ్చు. 12 ఏళ్ల మౌన వ్రతాన్ని పౌరులు విరమించారు. తమ గొంతును, తమ మెదడులను భారతీయులు తిరిగి కనుగొన్నారు. స్పష్టంగా వెనుకంజలో ఉన్న ప్రభుత్వాన్ని ఎదుర్కొంటూ, తమ ప్రాథమిక రాజ్యాంగ హక్కులను నొక్కిచెబుతూ, లెక్కలేనంతమంది ఆగ్రహావేశులైన, నిరాశకు గురైన భారతీయులు నిర్భయంగా కీలక ప్రశ్నలను లేవనెత్తుతున్నారు.

2014కు ముందటి యుగానికి, జంతర్‌మంతర్ వద్ద జెన్–జీ జన్మనిచ్చిన కొత్త యుగానికి మధ్య విభజన రేఖగా భారత చరిత్ర ఈ కీలక ఘట్టాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రభుత్వ మూర్ఖత్వాన్ని ఎలా వివరించగలం? తమ మేధో శక్తి, ఆర్థిక వనరులు, నిఘా నెట్‌వర్క్‌లు, రహస్య కార్యకలాపాలు, బెదిరింపు వ్యూహాలు ఉన్నప్పటికీ, ఒక్క మార్కెటింగ్ మేధావి కూడా నేతలకు స్పష్టమైన సత్యాన్ని చెప్పలేకపోయారు –యువకిరణాలతో నిండిన భారత్‌ను అలసిపోయిన వృద్ధులు నడుపుతున్నారన్న సత్యాన్ని. 70, 80 ఏళ్ల వయసున్న స్త్రీ, పురుషుల దయాదాక్షిణ్యాలపై అద్భుతమైన యువ దేశం ఆధారపడి ఉంది. వీరిలో చాలామంది స్పష్టంగా వృద్ధులు, నేటి వేగంగా మారుతున్న ప్రపంచంతో పూర్తిగా సంబంధం కోల్పోయినవారు. పాత కాలంలో ఇరుక్కుపోయి, మార్పును అంగీకరించలేని, యువ భారత్ కోరుకుంటున్నది ఏమిటో పాతబడిన అభిప్రాయాలతో వ్యవహరిస్తున్న వారి ధోరణి, చివరకు వారికే ఎదురుతిరిగింది. కాలం చెల్లిన, ప్రాచీనమైన, విసుగుపుట్టించే వారి బోధనా ధోరణి, డొల్ల నీతివాక్యాలు వారికే ప్రతికూలంగా మారుతున్నాయి. జెన్–జీ, జెన్ ఆల్ఫా రెండూ 'జెన్ జీ' (వృద్ధతరం)తో విసిగిపోయాయి. వారి సలహా ఏమిటంటే –ఇంటికి వెళ్లండి, విశ్రాంతి తీసుకోండి, మీరు అందించగలిగే దానికంటే మాకు ఎక్కువ కావాలి. కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి –మేం మిమ్మల్ని వదిలిపెట్టం, అన్నీ గుర్తుంచుకుంటాం.

ఇక అయోమయంలో పడిన మధ్యవయస్కుల తరం సంగతేంటి? కాలాన్ని అకస్మాత్తుగా వెనక్కి తిప్పి, బొద్దింకలతో కలిసి బారికేడ్ల వద్ద పోరాడలేం, 'దిమాగీ నక్సల్స్' అని గర్వంగా చెప్పుకుంటూ సర్కారుకు కష్టమైన ప్రశ్నలు వేయలేం. కానీ మాట్లాడగలం! దానికి వయోపరిమితి లేదు. 12 ఏళ్లకుపైగా, భారత్‌లో అత్యధిక భాగం మౌనంగా ఉండిపోయింది. ఇది ప్రజాస్వామ్యంగా నటిస్తూ నిరంకుశత్వం ఎలా పనిచేస్తుందో చెప్పే శక్తివంతమైన ఉదాహరణ. బెదిరింపులు, శిక్షలు, తప్పుడు కేసులు, నకిలీ ఆరోపణలు ఎదుర్కొంటూ, దేశవ్యాప్తంగా అశక్తులైన ప్రజానీకం మౌనంగా బాధపడటాన్నే ఎంచుకుంది, సర్కారు క్రమంగా మరింత నిరంకుశంగా మారడానికి అవకాశమిచ్చింది. అధికారం, ప్రత్యేకాధికారాల దుర్వినియోగం ఏమాత్రం అడ్డు లేకుండా, ప్రశ్నించబడకుండా సాగింది, త్వరలోనే నిర్లిప్తత ఆవహించింది. ఈ నేతలను కీర్తించినవారు సమృద్ధిగా బహుమతులు పొందారు, అభ్యంతరం చెప్పినవారు పక్కకు నెట్టివేయబడ్డారు. దేశభక్తి ముసుగులో ప్రచారం ఆమోదయోగ్యంగా, లాభదాయకంగా కూడా మారింది. బొద్దింకలు కలప కుప్పల నుంచి బయటకు వచ్చేవరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. మంజిల్ కుదిపేయబడింది. దేశవ్యాప్తంగా పిల్లలు తమకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నాణ్యమైన విద్య కోసం డిమాండ్ చేస్తుండగా, వారి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. జార్ఖండ్‌కు చెందిన ఒక యువతి దీన్ని అద్భుతంగా వ్యక్తం చేసింది –"జార్ఖండ్ 25 ఏళ్ల వయసున్నా, ఇప్పటికీ ఒక ఏడాది వయసున్నట్టే అనిపిస్తుంది" అని.

గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు 2.6 కోట్లు తగ్గింది. భారత్‌లో ప్రతిరోజూ 25 ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. ప్రధాని 'వికసిత్ భారత్' లక్ష్యానికి తోడ్పడాలంటే ఈ పిల్లలు ఎక్కడ చదువుకోవాలి? నీరు, బెంచీలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, బ్లాక్‌బోర్డులు, అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేని 'అశిక్షిత' పిల్లలకు, తామే అర్ధ అక్షరాస్యులేమో అనిపించే నేతలు పాఠాలు చెబుతున్నారు. 326 మంది ఎంపీలు, 14మంది ముఖ్యమంత్రులపై నేర కేసులు ఉన్నాయని ఇటీవలే సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీన్ని, పిల్లలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యను పరిష్కరించే బదులు, విద్యా వ్యవస్థలో తక్షణ సంస్కరణలు ప్రకటించే బదులు, ప్రధాని ఆర్భాటంగా ఉచిత కోచింగ్ తరగతులను ప్రారంభించారు. దీన్నే ఆలోచించకుండా, తొందరపాటుగా తీసుకున్న నిర్ణయం అంటారు. అంతకంటే ఘోరంగా, బీజేపీ కొత్త ఐటీ సెల్‌ను ఏర్పాటు చేసింది, అందులో నిర్మాణాత్మక సంభాషణపై అత్యంత వక్రీకృత ఆలోచనలు కలిగిన, దూషణపూరిత, అనాగరిక సభ్యులు నిండిపోయారు. "మాతో ఆలస్య వ్యూహాలు ఆడకండి" అని విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌ల విషయంలో ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ కాక్రోచ్ పార్టీ పోస్టర్ బాయ్ సౌరవ్ దాస్ అన్నారు. "బడులను బాగుచేయండి" అన్నదే దిమాగీ నక్సల్స్ యుద్ధనినాదం. పదాలతో ఆడుకోవడం ఇష్టపడే, తన ప్రసంగాలకు రచయితలపైనే ఆధారపడే ప్రధాని, తనకు తెలియకుండానే 'దిమాగీ నక్సల్స్' అనే పదాన్ని సృష్టించడం విడ్డూరం. అవమానంగా రూపొందించినది, రాత్రికి రాత్రే ఒక గుర్తింపుగా, గౌరవ చిహ్నంగా మారిపోయింది. అయితే, బొద్దింకలు, దిమాగీ నక్సల్స్‌ను పాలన చేపట్టమని ఎక్కువగా ప్రోత్సహించకూడదు –వారు ప్రత్యామ్నాయం ఖచ్చితంగా కాదు. భవిష్యత్తులో ఈ రెండు వర్గాలు ఎలా వ్యవహరిస్తాయో మరింత అప్రమత్తంగా గమనించాల్సిన అవసరం ఉంది. కొందరు మొరటు, దూకుడు జెన్–జీ యువకులు, ప్రత్యేక హక్కు కార్డు పట్టుకున్నట్టు మొండిగా ప్రవర్తిస్తూ, యావత్ తరానికే చెడ్డపేరు తెస్తున్నారు. అసమంజసమైన రాయితీలు కోరుతూ మారాం చేసేవారిని గారాబం చేయాల్సిన అవసరం ఎవరికీ లేదు. ■




నేటి తరంలో సంబంధాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం సంభాషణ లోపమే. కూర్చుని మాట్లాడుకుని అపార్థాలను తొలగించుకునే బదులు, ఎదుటివారి మాట వినకుండానే తీర్పులు ఇస్తున్నారు. చిన్న మనస్పర్థలకే దూరమవుతున్నారు. అహం పెరిగే కొద్దీ నిజాయతీ, నమ్మకం తగ్గుతున్నాయి. ఫలితంగా మనసును అర్థం చేసుకునే మంచి మనుషుల స్థానాన్ని నటించే నకిలీ వ్యక్తులు ఆక్రమిస్తున్నారు. ఒకసారి మనసు విప్పి మాట్లాడితే ఎన్నో బంధాలు నిలిచిపోతాయి.

-మహాదేవ

వింతల్లో వింతలు

## గుల్లల వేటలో మెగా సర్‌ప్రైజ్




అమెరికాలోని న్యూజెర్సీ తీరంలో గుల్లలు ఏరుకుంటున్న 11 ఏళ్ల బాలుడు బో బోవర్స్‌కు అనూహ్యమైన నిధి దొరికింది. తండ్రి మైక్ బోవర్స్‌తో కలిసి సీ ఐల్ సిటీలో సముద్రతీరాన్ని జల్లెడ పడుతుండగా, రెండు రాళ్ల మధ్య ఇరుక్కుపోయిన ఒక భారీ దంతం కంటపడింది. తండ్రి చేయి అందులో పట్టకపోవడంతో, చిన్నారి బో ధైర్యం చేసి దాన్ని బయటకు తీశాడు. తీరా పరిశీలిస్తే అది కోట్లాది సంవత్సరాల క్రితమే అంతరించిపోయిన అతిపెద్ద మాంసాహార సొరచేప 'మెగలోడాన్' దంతమని తేలింది! న్యూజెర్సీ స్టేట్ మ్యూజియంలో నిపుణులు దీన్ని పరిశీలించి, ఇది వందశాతం నిజమైన మెగలోడాన్ దంతమేనని ధృవీకరించారు. బాలుడి అరచేయి పరిమాణంలో ఉన్న ఈ శిలాజం, న్యూజెర్సీ తీరంలో ఇప్పటివరకూ నమోదైన కేవలం ఆరో మెగలోడాన్ దంతంగా చరిత్రకెక్కింది. బహిరంగ బీచ్‌లో దొరకడంతో, ఈ అరుదైన నిధిని తమతోనే ఉంచుకునే అనుమతి కూడా బోవర్స్ కుటుంబానికి లభించింది.

# కొలంబో టెస్టుకు వరుణుడి బ్రేక్

- భారత ఇన్నింగ్స్‌కు వర్షం అంతరాయం
- ఆట నిలిచేసరికి భారత్ 475/8
- 95 పరుగులతో శతకానికి చేరువలో ధ్రువ్ జురెల్
- రిషభ్ పంత్ మెరుపులు.. 63 పరుగులతో కీలక ఇన్నింగ్స్




**కొలంబో:** భారత్-శ్రీలంక రెండో టెస్టుకు వరుణుడు అడ్డుపడ్డాడు. రెండో రోజు టీ విరామానికి ముందే ఆకాశం మేఘావృతమై కొద్దిసేపటికే వర్షం మొదలైంది. దీంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. అప్పటికి భారత్ ఎనిమిది వికెట్ల నష్టానికి 475 పరుగులతో భారీ స్కోరు సాధించింది. ధ్రువ్ జురెల్ 95 పరుగులతో అజేయంగా నిలిచి శతకానికి చేరువయ్యాడు. ఓవర్‌నైట్ స్కోరు 300/5తో రెండో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అరంగేట్ర ఆటగాడు సరాన్ష్ జైన్ 6 పరుగులకే వెనుదిరిగాడు. తొలి రోజు రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడిన రిషభ్ పంత్ తిరిగి క్రీజులోకి వచ్చి తనదైన శైలిలో శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నిర్మించాడు. పంత్ టెస్టుల్లో తన 21వ అర్ధశతకాన్ని నమోదు చేసి 63 పరుగులతో ఔటయ్యాడు. మరోవైపు జురెల్ నిలకడగా ఆడుతూ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో బౌండరీతో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో జురెల్‌కు ఇది మూడో అర్ధశతకం. పంత్-జురెల్ జోడీ శతక భాగస్వామ్యంతో భారత్‌ను భారీ స్కోరు దిశగా నడిపించింది. లంచ్ సమయానికి భారత్ ఆరు వికెట్లకు 419 పరుగులు చేసింది. భోజన విరామం అనంతరం తొలి బంతికే పంత్ వెనుదిరిగినా జురెల్ మాత్రం పట్టువదల్లేదు. మానవ్ సుతార్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో బౌండరీ సాధించి 95 పరుగులకు చేరుకున్న జురెల్ తొలి టెస్టు శతకానికి కేవలం ఐదు పరుగుల దూరంలో నిలిచాడు. అదే సమయంలో కొలంబోలో మబ్బులు దట్టంగా కమ్ముకోవడంతో అంపైర్లు టీ విరామాన్ని ముందుగానే ప్రకటించారు. అనంతరం వర్షం మొదలవడంతో ఆటకు అంతరాయం ఏర్పడింది. జురెల్ శతకం పూర్తి చేసిన తర్వాత భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసే అవకాశముండటంతో ఆట పునఃప్రారంభంపై ఆసక్తి నెలకొంది.




# పంత్ భారీ సిక్సర్.. ముక్కలైన స్టేడియం పైకప్పు అద్దం!

**కొలంబో:** కొలంబో టెస్టులో రిషభ్ పంత్ తన మార్క్ విధ్వంసం చూపించాడు. మణికట్టు గాయం నొప్పిని భరిస్తూనే కీలక ఇన్నింగ్స్ ఆడిన పంత్ మెరుపు అర్ధ శతకంతో జట్టు భారీ స్కోర్‌లో భాగమయ్యాడు. తన తుఫాన్ ఇన్నింగ్స్‌తో శ్రీలంక బౌలర్లను హడలెత్తించిన ఈ చిచ్చరపిడుగు.. స్టేడియం పైకప్పు అద్దాన్ని సైతం పగలగొట్టాడు. శ్రీలంక పర్యటనలో భాగంగా కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టులో భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ చెలరేగాడు. ఎడాపెడా బౌండరీలతో శ్రీలంక బౌలర్లను బెంబేలెత్తించిన పంత్ .. స్టేడియం పైకప్పు అద్దాన్ని ముక్కలు చేశాడు. రెండో రోజు తొలి సెషన్‌లోనే సరాన్ష్ జైన్ ఔటయ్యాక బ్యాటింగ్‌కు వచ్చిన ఈ పంత్.. 90వ ఓవర్లో భారీ సిక్సర్ బాదాడు. లహిరు కుమార సంధించిన బంతిని ఫైన్ లెగ్‌లో పంత్ బాదేయగా.. బంతి నేరుగా వెళ్లి స్టేడియం పైకప్పు మీదపడింది. 95 మీటర్ల ఆ సిక్సర్ ధాటికి అక్కడి సోలార్ రూఫ్ అద్దం పగిలిపోయింది. దాంతో.. లంక ఆటగాళ్లే కాదు కామెంటర్లు, ప్రేక్షకులు షాకయ్యారు. ఇక కామెంటేటర్ రస్సెల్ ఆర్నాల్డ్ అయితే పంత్ ధాటికి స్టేడియంలో ఏసీలు పనిచేయడం లేదు అని జోక్ చేశాడు.





### శతక భాగస్వామ్యం

తొలి సెషన్‌లో లంకబౌలర్లను ఉతికారేసిన పంత్ టెస్టుల్లో 21వ హాఫ్ సెంచరీ సాధించాడు. అంతేకాదు టెస్టుల్లో అత్యధిక పరుగుల చేసిన భారత వికెట్ కీపర్‌గా ఎంఎస్ ధోనీ రికార్డును బ్రేక్ చేశాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి అతడు శతక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఫలితంగా లంచ్ బ్రేక్ సమయానికి భారత్ 6 వికెట్ల నష్టానికి 419 రన్స్ చేసింది. అయితే.. భోజన విరామానికి 63 పరుగులతో ఉన్న పంత్ తర్వాత మొదటి బంతికే ఔటయ్యాడు.

# 140 ఏళ్లలో ఇదే తొలిసారి..

## ఓటమిలోనూ చరిత్ర సృష్టించిన షరీఫుల్!



- ఆస్ట్రేలియాపై బంగ్లా పేసర్ సంచలనం
- 15 ఓవర్లలో 48 పరుగులిచ్చి ఏడు వికెట్లు
- అయినా బంగ్లాదేశ్‌కు ఇన్నింగ్స్ ఓటమి
- రెండు టెస్టుల సిరీస్ 1-1తో సమం


**మాకే:** ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ ఘోర పరాజయం పాలైనా.. ఆ జట్టు స్టార్ పేసర్ షరీఫుల్ ఇస్లాం మాత్రం చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. ఏకంగా 140 ఏళ్లుగా సాధ్యం కాని అరుదైన ఘనతను అందుకుని ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించాడు. ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు పడగొట్టిన తొలి ఎడమచేతి పేసర్‌గా షరీఫుల్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో షరీఫుల్ నిప్పులు చెరిగాడు. 15 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 48 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. అతడి ధాటికి ఆసీస్ బ్యాటింగ్ విభాగం తడబడింది. చివరకు ఆస్ట్రేలియా 210 పరుగులకు ఆలౌటైంది.ఆస్ట్రేలియాతో టెస్టులో ఎడమచేతి పేసర్ ఒక ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు పడగొట్టడం 140 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1886లో ఇంగ్లండ్‌కు చెందిన డిక్ బార్లో మాంచెస్టర్ టెస్టులో 44 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత ఇన్నేళ్లకు షరీఫుల్ ఆ ఘనతను అందుకున్నాడు. ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన రికార్డు మాత్రం ఇంగ్లండ్ దిగ్గజ స్పిన్నర్ జిమ్ లేకర్ పేరిట ఉంది. 1956 మాంచెస్టర్ టెస్టులో ఆయన 53 పరుగులిచ్చి మొత్తం పది వికెట్లను నేలకూల్చి చరిత్ర సృష్టించాడు.

### షరీఫుల్ మెరిసినా.. బంగ్లా కుప్పకూలింది

బౌలింగ్‌లో షరీఫుల్ అద్భుతం చేసినా బంగ్లాదేశ్ బ్యాటర్లు మాత్రం పూర్తిగా చేతులెత్తేశారు. తొలి ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో 64 పరుగులకే ఆలౌటైన బంగ్లా.. రెండో ఇన్నింగ్స్‌లోనూ 38.3 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి పది వికెట్లు పడగొట్టి బంగ్లా పతనాన్ని శాసించాడు. ఫలితంగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి టెస్టులో బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించగా.. రెండో టెస్టును ఆసీస్ గెలుచుకోవడంతో రెండు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సవ-ంమైంది.

### ర్యాంకింగ్స్‌లోనూ బంగ్లా కొత్త చరిత్ర

సిరీస్ అనంతరం బంగ్లాదేశ్‌కు మరో అరుదైన ఘనత దక్కింది. తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకుంది. 78 రేటింగ్ పాయింట్లతో వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంకలను వెనక్కి నెట్టి ఆరో స్థానంలో నిలిచింది. టెస్టు ర్యాంకింగ్స్‌లో బంగ్లాదేశ్ తొమ్మిదో స్థానం కంటే పైకి రావడం ఇదే తొలిసారి.




# అమ్మాయిలదీ అదే కథ

**అమ్‌స్టెల్వీన్:** హాకీ ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు ప్రస్థానం ముగిసింది. నెదర్లాండ్స్ చేతిలో పురుషుల జట్టు ఓటమి బాధ మరువక ముందే అమ్మాయిల పోరాటమూ రెండో దశలోనే ఆగిపోయింది. పూల్ 'ఈ'లో భాగంగా ఆడిన మూడు మ్యాచుల్లో రెండు డ్రా చేసుకుని ఒకదాంట్లో ఓడిన సలీమ సేన.. ఆదివారం ఆస్ట్రేలియాతో గేమ్‌నూ డ్రాగానే ముగించింది. ఈ మ్యాచ్‌లో గెలిచి సెమీస్‌కు చేరాలన్న 52 ఏండ్ల నిరీక్షణకు తెరదించాలని యత్నించిన భారత్‌కు మరోసారి నిరాశే ఎదురవగా ఆస్ట్రేలియా సెమీస్‌కు అర్హత సాధించింది. మ్యాచ్‌లో పలుమార్లు పెనాల్టీ కార్నర్‌లు లభించినా వాటిని గోల్స్‌గా మలచడంలో రెండు జట్లూ విఫలమయ్యాయి. ఇదిలాఉండగా ఇప్పటికే సెమీస్ ఆశలు గల్లంతైన వేళ భారత పురుషుల జట్టు అర్జెంటీనాతో కీలక మ్యాచ్ ఆడనుంది. ఈ టోర్నీ సెమీస్ రేసులో నిలవాలంటే ఇతర సమీకరణాలకు తోడు హర్మన్‌ప్రీత్ సేన ఈ మ్యాచ్‌లో భారీ గోల్స్ తేడాతో విజయం సాధించాల్సి ఉంది.

# జైస్వాల్‌కు ఐసీసీ షాక్!

## లంక పేసర్‌తో వాగ్వాదం.. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత

## అసిత ఫెర్నాండోకూ అదే శిక్ష

- ఇద్దరి ఖాతాలో ఒక్కో డీమెరిట్ పాయింట్
- తలలు దగ్గరకు రావడంతో జైస్వాల్ హెల్మెట్ తాకిన ఘటన
- తప్పు అంగీకరించడంతో విచారణ లేకుండానే శిక్ష ఖరారు

**కొలంబో:** శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మైదానంలో సహనం కోల్పోయిన భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి షాక్ ఇచ్చింది. శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగిన ఘటనను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ.. ఇద్దరికీ మ్యాచ్ ఫీజులో 25 శాతం చొప్పున జరిమానా విధించింది. అంతేకాకుండా ఇద్దరి క్రమశిక్షణ రికార్డుల్లో ఒక్కో డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 17వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ ఔటయ్యాడు. శ్రీలంక ఆటగాళ్లు వికెట్‌ను సంబరంగా జరుపుకుంటుండగా జైస్వాల్ పెవిలియన్ వైపు వెళ్తున్న సమయంలో ఫెర్నాండో ఏవో వ్యాఖ్యలు చేయడంతో పరిస్థితి వేడెక్కింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి పరస్పరం ఎదురెదురుగా వచ్చారు. ఈ క్రమంలో ఫెర్నాండో తన తలను జైస్వాల్ వైపు తీసుకురాగా.. జైస్వాల్ కూడా ముందుకు వంగడంతో అతడి హెల్మెట్ ఫెర్నాండో నుదిటిని తాకింది. పరిస్థితి మరింత ముదరకముందే శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వాతో పాటు ఇతర ఆటగాళ్లు జోక్యం చేసుకుని ఇద్దరినీ విడదీశారు.

### ఇద్దరికీ ఒకే శిక్ష

ఈ ఘటనను ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12 ఉల్లంఘనగా మ్యాచ్ అధికారులు పరిగణించారు. అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా ఆటగాడు, అంపైర్, మ్యాచ్ రిఫరీ లేదా ఇతర వ్యక్తితో అనుచిత శారీరక స్పర్శకు దిగడాన్ని ఈ నిబంధన నిషేధిస్తుంది. మైదాన అంపైర్లు అహ్సన్ రజా, షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, మూడో అంపైర్ రాడ్ టక్కర్, నాలుగో అంపైర్ ప్రగీత్ రాంబుక్వెల్లా అభియోగాలు మోపారు. జైస్వాల్, ఫెర్నాండో తమ తప్పును అంగీకరించడంతో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ప్రతిపాదించిన శిక్షను ఇద్దరూ అంగీకరించారు. దీంతో ప్రత్యేక విచారణ అవసరం లేకుండా పోయింది.

### మరోసారి తప్పితే చిక్కులే!

గత 24 నెలల్లో జైస్వాల్, ఫెర్నాండోకు ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘనల రికార్డు లేకపోవడంతో దీన్ని తొలి తప్పిదంగా పరిగణించారు. లెవల్-1 ఉల్లంఘనకు అధికారిక హెచ్చరిక నుంచి మ్యాచ్ ఫీజులో గరిష్ఠంగా 50 శాతం వరకు జరిమానాతో పాటు ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉంటుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం 24 నెలల వ్యవధిలో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు చేరితే అవి సస్పెన్షన్ పాయింట్లుగా మారతాయి. దీంతో మ్యాచ్‌ల నిషేధం ఎదురయ్యే ప్రమాదమూ ఉంటుంది. తాజా ఘటనతో జైస్వాల్, ఫెర్నాండో ఖాతాల్లో ఒక్కో డీమెరిట్ పాయింట్ చేరింది.







# మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శుక్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది.క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్‌గా కనిపించారు. కేవలం 14 రోజుల్లో అసుర విజయ ఘోష సమస్త బ్రహ్మాండంలో ప్రతిధ్వనించేలా చేస్తానంటూ ఆయన చేసే ప్రతిజ్ఞ కథపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబోతున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మహాకాళి రౌద్ర రూపం. నల్లని వర్ణం, ముక్కుపుడక, ఉగ్ర స్వరూపంతో అమ్మవారిని అత్యంత శక్తిమంతంగా చూపించారు.

# వారణాసిపై మరో సంచలన వార్త

## వివిధ భాషల కోసం 1600 మంది డబ్బింగ్ ఆర్టిస్టులు





దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు రూ.1,400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. ఆయా భాషలకు సంబంధించిన ఉచ్చారణ, స్థానిక యాస, సంస్కృతికి అనుగుణంగా డైలాగ్స్‌ను రికార్డ్ చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా వంటి ప్రధాన నటుల నటనలోని ఎమోషన్ ఏ భాషలో చూసినా ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా ఈ డబ్బింగ్ ప్రక్రియను డిజైన్ చేస్తున్నారట. 50కి పైగా భాషల్లో ఇంత భారీ సంఖ్యలో డబ్బింగ్ ఆర్టిస్టులతో పనిచేయడం భారతీయ సినిమా స్థాయిలో అరుదైన ప్రయత్నంగా మారనుంది. వారణాసి కథాంశం కూడా అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. భూమిని ఢీకొట్టేందుకు దూసుకొస్తున్న ఓ భారీ ఉల్క వల్ల ఏర్పడే ప్రమాదం నుంచి వారణాసితో పాటు ప్రపంచాన్ని రక్షించే సాహసోపేతమైన కథతో ఈ సినిమా సాగుతుందని సమాచారం. మహేష్ బాబు ఇందులో 'రుద్ర' అనే పాత్రలో కనిపించనుండగా.. కథలో భాగంగా వివిధ కాలాల మధ్య ప్రయాణించే సాహసికుడిగా ఆయన పాత్ర ఉండబోతుందని టాక్. భారతీయ పురాణాలు, సనాతన సంస్కృతి అంశాలను ఆధునిక గ్లోబల్ అడ్వెంచర్ కథతో కలిపి రాజమౌళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. 'వారణాసి' షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్, ఒడిశా, ఆఫ్రికాలోని కెన్యా తదితర ప్రాంతాల్లో జరిగింది. అంతేకాదు.. అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకున్న తొలి భారతీయ చిత్రంగా ఈ సినిమా ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.



# రాకాలో ఐశ్వర్యలక్ష్మి

## నెగెటివ్ షేడ్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది.




ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది. ఓ పవర్‌ఫుల్ డాన్ చుట్టూ తిరిగే ఈ కథలో అల్లు అర్జున్ అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారని టాక్. ముఖ్యంగా అట్లీ సినిమాల ప్రత్యేకతగా నిలిచే భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా ఉంటాయని తెలుస్తోంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com